



visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

సోమవారం | 9 సెప్టెంబర్ 2024 | హైదరాబాద్

సంపుటి 17 | సంచిక 279
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50






Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi


అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - వర్ష ఋతువు, భాద్రపద మాసం శుద్ధ షష్టి సా.4.58, విశాఖ మ.2.47, వర్జ్యం రా.7.03 నుంచి 8.45 వరకు
రాహుకాలం ఉ.7.30 నుంచి 9.00 వరకు దుర్ముహూర్తం మ.12.21 నుంచి 1.10 వరకు తిరిగి మ.2.46 నుంచి 3.35 వరకు

# భారత్‌లో చేరండి..!

- పీవోకే ప్రజలకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపు
- జమ్మూకశ్మీర్‌లో జోరుగా అసెంబ్లీ ఎన్నికల ప్రచారం
- రాంబన్ నియోజకవర్గంలో కేంద్ర మంత్రి ప్రచారం
- పాక్ మాదిరి కాదు.. సొంత మనుషుల్లా చూసుకుంటాం : రాజ్‌నాథ్ సింగ్

జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. రామ్‌బన్ నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన భాజపా ప్రచారంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ విషయంలో కీలక వ్యాఖ్యలు చేశారు. పీవోకేవాసులు భారత్‌లో కలిసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.


6 లో

## చైనాలో కొత్త రకం వైరస్


6 లో

- జంతువుల్లో రక్తం పీల్చే పురుగుల నుంచి మనుషులకు వ్యాపించే వైరస్
- పురుగుల కాటుకు గురైన 20 మంది బాధితులకు పాజిటివ్ రావడంతో వైరస్ నిర్ధారణ

# అర్హులైన ప్రతి జర్నలిస్టుకు
# న్యాయం చేస్తా

- అసలు కంటే కొసరు ఎక్కువైంది
- ఎవరు జర్నలిస్టులు ?
- జర్నలిస్ట్ అనే పదానికి మీరే అర్థం చెప్పండి
- యూట్యూబర్‌లపై సీఎం రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు
- జర్నలిస్టులందరికీ న్యాయం చేస్తాం
- అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు, ఇళ్ల పట్టా, హెల్త్ కార్డు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదే
- హౌసింగ్ సొసైటీలో సభ్యులకు భూ కేటాయింపు పత్రాల పంపిణీ
- జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలో ఇళ్ల స్థలాల కేటాయింపు
- హైదరాబాద్ రవీంద్రభారతిలో పత్రాల పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు-2లో




6 లో

## కర్నాటక సీఎం కుర్చీపై సీనియర్ల కన్ను

- సీఎం సిద్దుకు బిగుసుకుంటున్న ముడా స్కామ్ ఉచ్చు
- సిద్ధరామయ్య తర్వాత నేనే సీనియర్ అంటూ నేతల మధ్య వార్
- బయటకు పొక్కిన ఇద్దరు సీనియర్ మంత్రుల మాటల యుద్ధం


6 లో

## భారత్‌లో మంకీపాక్స్

- అనుమానాస్పద కేసు నమోదు
- విదేశాల నుంచి వచ్చిన ఓ యువకుడిలో ఎంపాక్స్ లక్షణాలు
- వెల్లడించిన కేంద్ర ఆరోగ్యశాఖ

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ వంచన



- 9 నెలల కాంగ్రెస్ పాలనలో 490 మంది రైతులు ఆత్మహత్యలు
- ఇవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

వివరాలు-2లో

# వరదలపై రాజకీయం
# సరికాదు

- విపత్కర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలి
- ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాలి
- తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం అడ్వాన్స్ డిజాస్టర్ ఫండ్ కింద రూ.1,300 కోట్లు పంపింది
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి



2 లో

మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పర్యటించారు. ఖమ్మం నగరంలోని 16వ డివిజన్‌ దంసాలపురం, తిరుమలాయపాలెం, రాకాసి తండాలో వరదముంపు బాధితులతో కేంద్ర మంత్రి మాట్లాడారు. వీధుల్లో తిరుగుతూ అక్కడి పరిస్థితిని స్వయంగా తెలుసుకున్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో
# భారీ వర్షాలు

- పలు జిల్లాల్లో రెడ్, ఆరెంజ్ అలర్ట్
- వాయుగుండం ప్రభావంతో ఏపీ, తెలంగాణలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడి

వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనూ రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.


2 లో

## అంతా ఇంతే!




ఇప్పుడు కొడంగల్ వైపు భూములు కొందామా సార్!

## స్థానిక సంస్థల కోటా
# రిజర్వేషన్లు పెంచాలి

- బీసీలకు 20% నుంచి 40 శాతానికి పెంచాలి
- కామారెడ్డి డిక్లరేషన్ అమలు ఎక్కడ ?
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాసిన బీసీ నేత, ఎంపీ ఆర్.కృష్ణయ్య


2 లో

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల వాగ్దానం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం పంచాయతీరాజ్ మున్సిపల్ ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం కు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యకులు ఆర్. కృష్ణయ్య కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాశారు, రాహుల్ గాంధీ బీసీల గురించి అనుకూలంగా మాట్లాడుతున్నారు. కానీ ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు పెంపు గురించి మాట్లాడలేదు. అణిచివేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

## హసీనా అరెస్టుకు
# బంగ్లాదేశ్ సన్నాహాలు


6 లో

వారెంట్ జారీకి అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్‌కు దరఖాస్తు

## అవినీతి పరులందరినీ
# జైలుకు పంపిస్తా

అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వైరల్గా మారింది. ఎన్నికల సమయంలో అవినీతికి పాల్పడే వారిని ఉద్దేశిస్తూ ఈ పోస్టు చేశారు. తాను అధికార పీఠమెక్కాక అవినీతిపరులందరిని జైలుకు పంపిస్తానని హెచ్చరించారు. తమ ప్రభుత్వం వారికి కఠిన శిక్ష అమలు చేస్తుందని పేర్కొన్నారు.


6 లో

## డీకే శివకుమార్‌కు
# కమలా ఆహ్వానం


6 లో

- న్యూయార్క్‌లో కమలతో వ్యక్తిగతంగా చర్చించనున్నట్లు సమాచారం
- ఒబామాతో కూడా మీటింగ్‌కు ప్లాన్
- రాహుల్ గాంధీ పర్యటన సమయంలోనే అమెరికాకు డీకే
- బయటకురాని సమావేశాల అజెండా

సూర్య
హైదరాబాద్
సోమవారం
9 సెప్టెంబర్ 2024




# తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

● పలు జిల్లాల్లో రెడ్, ఆరెంజ్ అలర్ట్
● వాయుగుండం ప్రభావంతో ఏపీ, తెలంగాణలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడి

తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనూ రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రానున్న రెండు రోజుల్లో కోస్తాలోని శ్రీకాకుళం, మన్యం, విజయనగరం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడనున్నాయి. దీంతో ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ హెచ్చరికలు జారీ చేసింది. విశాఖ, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, యానాంలకు ఆరెంజ్ అలర్ట్.. విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు గరిష్ఠంగా 70 కిలోమీటర్లు బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. కళింగపట్నం, భీమిని పట్నం, గంగవరం, కాకినాడ పోర్టుల్లో మూడో నెంబర్ ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

దీంతో ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. సోమవారం కూడా కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లోనూ భారీ వర్షాలు పడే అవకాశం ఉంది.



## అర్హులైన ప్రతి జర్నలిస్టుకు

# న్యాయం చేస్తా

● హౌసింగ్ సొసైటీలో సభ్యులకు భూకేటాయింపు పత్రాల పంపిణీ ● కార్యక్రమం పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి రేవంతడ్డి అన్నారు. జవహర్లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలో సభ్యులకు భూకేటాయింపు పత్రాల పంపిణీ కార్యక్రమం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం రేవంతడ్డి హాజరై ప్రసంగించారు. గతంలో జర్నలిస్టులకు ఇళ్లు కేటాయించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. సమస్యను పరిష్కరించాల్సిన వ్యక్తులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. అలా వ్యవహరించినప్పుడే సమస్యను పరిష్కరించవచ్చు. మా ప్రభుత్వం అనేక సమస్యలకు పరిష్కారం చూపింది. వృాఎత్తిపరమైన గౌరవం మనకు మనమే పెంచుకోవాలి. గతంలో అసెంబ్లీ జరిగినప్పుడు జర్నలిస్టులను లోపలికి అనుమతించలేదు. మా ప్రభుత్వం వచ్చాక స్పీకర్ను నేనే అసెంబ్లీ లోపలికి జర్నలిస్టులను అనుమతించాలని కోరా. ఏ వర్గంలో అయినా కొందరు చేసే పని వల్లనే ఇబ్బంది కలుగుతోంది. గతంలో సచివాలయానికి వెళ్లేందుకు మాకే అనుమతి లేదు. కొంత మందికి పాస్లు ఇచ్చి లోపలికి రప్పించి ఇబ్బంది కలిగిస్తున్నారు. అలాంటి వారిని కట్టడి చేయాల్సిన బాధ్యత జర్నలిస్టులపైనే ఉంది. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు, ఇళ్ల పట్టా, హెల్త్ కార్డు ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది. వ్యవస్థల మీద నమ్మకం పెంచాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. ఇళ్ల స్థలాల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన జవహర్లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలో 73 మంది నిజాన్ని చూడక ముందే కన్ను మూశారు. అర్హులైన ప్రతి జర్నలిస్టు ఫ్యూచర్ సిటీలో ఇళ్ల స్థలాలు ఇస్తాం అని రేవంతడ్డి అన్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ప్రతిభకు వైకల్యం అడ్డురాదు

## సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ప్రతిభకు వైకల్యం అడ్డురాదని నిరూపిస్తూ పారాలింపిక్స్ 2024లో పతకం సాధించిన తెలంగాణ యువ అథ్లెట్ జీవాంజి దీప్తి ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సత్కరించారు. విశ్వ వేదికపై సత్తా చాటిన పారా అథ్లెట్ దీప్తి గారికి గ్రూప్-2 స్థాయి ప్రభుత్వ ఉద్యోగం, 1 కోటి రూపాయల నగదు బహుమానం, వరంగల్లో 500 గజాల స్థలం, కోచ్ నాగపురి రమేష్ గారికి రూ. 10 లక్షలు బహుమతిగా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. ఇటీవల పారిస్ వేదికగా జరిగిన ప్యారిస్ లో జరిగిన 2024 మహిళల 400 మీటర్ల టీ20 రేసులో జీవాంజి దీప్తి కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. పారా అథ్లెట్స్, క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇచ్చేలా, వారికి అవసరమైన ప్రోత్సాహం అందించే ఏర్పాట్లు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. సీఎం జూబ్లీహిల్స్ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్) చైర్మన్ శివసేనా రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పరిపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ : జగదీష్ రెడ్డి

తెలంగాణ బ్యూరో/ప్రతినిధి : పరిపాలన, వరదల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీమంత్రి జగదీష్ రెడ్డి ఆరోపించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లా డుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో అట్టర్ ఫ్లాప్ అయ్యిందని విమర్శించారు. రైతు రుణమాఫీ గందరగోళంగా మారింది. ఇప్పటికి రూ.10 వేల కోట్లు కూడా మాఫీ కాలేదన్నారు. రుణమాఫీ పై స్పష్టతను ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ విషయంలో రైతులను ప్రభుత్వం మోసం చేస్తున్నది. అన్ని రంగాల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. మళ్ళీ 2014 ముందు లాంటి విద్యుత్ కష్టాలు మొదలైయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిపాలన గాలికి వదిలి వ్యక్తిగత సంపాదనలో మంత్రులు పడ్డారు. పెట్టుబడి సాయం రాక, పంట నష్ట పరిహార సాయం అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వరదల పై ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేదని విమర్శించారు. ఇంకా బురదలోనే వరద బాధితుల మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు. తప్పులు కప్పిపుచ్చుకునేందుకు దాడులకు తెగబడుతున్నారు. రూ.2లక్షల కు పైబడి ఉన్న డబ్బు కట్టించుకోకుండానే మాఫీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు.

# రేవంత్‌పై రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

● ఫాతిమా కాలేజీని ఎప్పుడు కూలుస్తారని ప్రశ్న
● రేవంత్ హీరో అవ్వాలంటే
ఓవైసీ కాలేజీని కూల్చాలని సూచన

తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః గత రెండు మూడు వారాలుగా తెలంగాణలో హైడ్రా కూల్చివేతలు ఏ స్థాయిలో వైరల్ అవుతున్నాయనేది తెలిసిన విషయమే. ఈ క్రమంలో... రాజకీయంగానూ ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశం అవుతుంది. ఈ నేపథ్యంలో హైడ్రా కూల్చివేతలపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించారు. ఈ సందర్భంగా... రేవంత్ హీరో అవ్వాలంటే అంటూ ఓ కీలక వ్యాఖ్య చేశారు. అవును... హైదరాబాద్ లోని అక్రమ కట్టడాలపై హైడ్రా విరుచుకుపడుతున్న విషయం తీవ్ర చర్చనీయాంశం అవుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ విషయంలో కమర్షియల్ భవనాలు, గృాఎహ సముదాయాలు, విద్యా సంస్థలకు చెందిన భవనాల విషయంలో హైడ్రా విభిన్నంగా ముందుకు వెళ్తుందని అంటున్నారు. ఈ సమయంలో రాజా సింగ్ స్పందించారు. ఇందులో భాగంగా... హైడ్రా అధికారులు ఒవైసీకి చెందిన ఫాతిమా కాలేజ్ ని ఎప్పుడు కూల్చేస్తున్నారని రాజాసింగ్ ప్రశ్నించారు. ఆ కాలేజీని ఏరోజు కూలుస్తారో సీఎం రేవంత్ రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ లు తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో.. ఒవైసీ కాలేజీలను కూల్చని పక్షంలో హైడ్రా విఫలమైనట్లేనని ఆయన విమర్శించారు. ఇదే సమయంలో... ఒవైసీకి చెందిన కాలేజీలను కూలిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హీరో అవుతారని ఆయన తెలిపారు. కమర్షియల్ నిర్మాణాల విషయంలో హైడ్రా స్పాట్ డెసిషన్ తీసుకుంటుందని.. నివాస సముదాయాల విషయంలో ముందస్తు నోటీసులు ఇస్తుందని అంటున్న సంగతి తెలిసిందే. ఇదే సమయంలో విద్యాసంస్థలకు సంబంధించిన నిర్మాణాల విషయంలో కాస్త ఆచి తూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా... విద్యార్థుల అకడమిక్ ఇయర్ ని దృాఎష్టిలో పెట్టుకుని విద్యాసంస్థలపై వస్తోన్న అక్రమ నిర్మాణాల



విషయంలో హైడ్రా నిర్ణయాలు ఉంటున్నాయని.. ప్రధానంగా హైడ్రా కూల్చివేతల వల్ల విద్యార్థుల అకడమిక్ ఇయర్ ఇబ్బందుల్లో పడకుండా, వారి చదువులను డిస్టర్బ్ చేయకుండా ఉండాలని తాము ఆలోచిస్తున్నట్లు ఇప్పటికే రంగనాథ్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.



# రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ వంచన

● 9 నెలల కాంగ్రెస్ పాలనలో 490మంది రైతులు ఆత్మహత్యలు
● ఇవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే ● మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: తెలంగాణలో కాంగ్రెస్ పాలన రైతుల పాలిట యమపాశంగా మారిందని బీఆర్ఎస్ సీనియర్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. 9నెలల కాంగ్రెస్ పాలనలో 490మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ పేరుతో రైతులను నయ వంచన చేశారని మండిపడ్డారు. మాఫీ కాకపోవడం వల్లే మేడ్చల్ జిల్లా వ్యవసాయ కార్యాలయంలో రైతు సురేందర్ రెడ్డి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే అని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. రుణమాఫీ కాలేదనే రైతు సురేందర్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నారు. మాఫీ అయితే ఎందుకు ప్రాణాలు తీసుకుంటాడు. మాఫీకి రేషన్ కార్డు లింక్ పెట్టడం వల్లే ఆ రైతు ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయం బాధితుడు స్వయంగా తన బ్యాంక్ పాస్ బుక్పై సూసైడ్ నోట్ రాసి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కాంగ్రెస్ వల్లనే అన్నదాతల ప్రాణాలు పోతున్నాయి. రుణమాఫీ ఎగ్గొట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం 31సాకులు చూపింది. పెళ్లి కాకపోతే కూడా రుణమాఫీ కాలేదు. పెళ్లికి దీనికి సంబంధ ఏంటి?. ఇంకా 21లక్షల మందికి రుణాలు మాఫీ కాలేదు. ఈ పథకం కిదం లబ్దిపొందిన వారి కంటే పొందని వారే ఎక్కువ మంది ఉన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతర రైతులకు సైతం రుణమాఫీ జరగలేదు. రూ.2లక్షల కంటే ఎక్కువ రుణం ఉంటే ఆపై మొత్తాన్ని అన్నదాతలే కట్టాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. కట్టొద్దని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్తున్నారు. ఎవరి మాటలు నమ్మాలి. 9నెలల కాంగ్రెస్ పాలనలో 490మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రైతు భరోసా ఎప్పుడు ఇస్తారో తెలీడం లేదు. రైతుల బోనస్ బోగస్ అయ్యింది. 15ఆగస్టు కల్లా మాఫీ చేస్తానని రేవంత్ రెడ్డి రైతన్నలను మోసం చేశారు. ఆయన అన్నదాతలకు క్షమాపణ చెప్పాలి. రైతులు ఎవరూ ఆత్మహత్య చేసుకోవద్దు. మీ పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుంది అని చెప్పారు.

## వినాయక మండపంను

# అడ్డుకోవడంతో ఘర్షణ

● ఒక వర్గం వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ● తమ స్థలంలో వినాయక మండపం ఏర్పాటు చేయవద్దు ● పోలీసులు ఏకపక్షంతో వ్యవహరిస్తున్నారు ● డాకారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో వినాయక మండపం ఏర్పాటు చేయడంతో ఒక వర్గం అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. వివరాల్లోకి వెళితే కూకట్ పల్లి మండలంలోని ఖైతలాపూర్ విలేజ్ సర్వేనెంబర్ 1007లో భూమి కోర్టు వివాదం లో ఉంది. ఖైతలాపూర్ కు చెందిన డాకా రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి రవీందర్ లకు చెందిన స్థలంలో మరో వర్గం వినాయక చవితి సందర్భంగా అక్కడ వినాయక మండపాన్ని ఏర్పాటుచేసి వినాయక ప్రతిమను ప్రతిష్టించే ప్రయత్నం చేశారు. తమ స్థలంలో వినాయక ప్రతిమ ఏర్పాటు చేయవద్దంటూ స్థలానికి చెందిన డాకారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మహేష్ లు అడ్డుకున్నారు. రెండు వర్గాలకు చెందిన వారు ఘర్షణకు దిగారు. ఒక వర్గం వారు అల్లాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి డాకా రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మహేష్ లను పోలీసులు అదుపులోకి తీసుకొని అల్లాపూర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా డాకా రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తమ స్థలంలో గతంలో అనుమతి లేకుండా బోర్లు వేశారని తాము ఫిర్యాదు చేస్తే ఆ బోర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారని తెలిపారు. అయితే అదే స్థలంలో మరో వర్గం వారు వినాయక మండపం ముసుగులో భూకబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఈ విషయమై తాము అల్లాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అయితే తాము అడ్డుకునే ప్రయత్నంలో పోలీసులు తమపైనే కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ పోలీస్ అధికారులు సమగ్రంగా విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

# పోరాట యోధునికి ఘనసత్కారం

● విధి నిర్వహణలో శక్తి వంచన లేకుండా కృషిచేసిన పోలీసు అధికారి ● దొంగను పట్టుకునేందుకు ఏడు కత్తిపోట్లకు గురై వీరోచిత పోరాటం ● విధి నిర్వహణే లక్ష్యం ● దొంగను పట్టుకోవడమే ప్రధానం ● రక్తపుమడుగులో సైతం అవిశ్రాంతంగా పోరాటం ● దొంగలు పట్టుకున్న హెడ్ కానిస్టేబుల్ చదువుల యాదయ్య ● కేంద్ర ప్రభుత్వం గుర్తించి పురస్కారం ● భగవాన్ స్వచ్ఛంద సేవ సంస్థ ఘనంగా సత్కారం ● కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, ఆరికపూడి గాంధీ ● సమాజానికి సేవలందించిన వారిని గుర్తిస్తాం ● భగవాన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పి.ఎస్.ఆర్.కే భగవాన్




తెలంగాణ బ్యూరో ప్రతినిధి: దొంగను పట్టుకునేందుకు అవిశ్రాంతంగా పోరాటం చేసి దొంగ చేతిలో కత్తిపోట్ల గురై దొంగను పట్టుకొని విధి నిర్వహణను సక్రమంగా నిర్వర్తించిన హెడ్ కానిస్టేబుల్ చదువుల యాదయ్యకు ఘన సత్కారం చేశారు. భగవాన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత పి.ఎస్.ఆర్.కే. భగవాన్. ఈ సందర్భంగా దొంగ దొంగతో వీరోచితంగా పోరాటం చేసి విజయం సాధించిన చదువుల యాదయ్యకు శాలువా కప్పి పూలమాలలు వేసి, తలపాగా పెట్టి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శేరి లింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృాఎష్ణారావు లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తల మాట్లాడుతూ చదువుల యాదయ్య విధి నిర్వహణలో భాగంగా క్రమశిక్షణతో పని చేస్తూ దొంగను పట్టుకునే కార్యక్రమంలో భాగంగా దొంగతనం చేసిన వ్యక్తి చేతిలో కత్తిపోట్ల గురై రక్తపు మడుగులలో సైతం పోరాటం చేసి చివరకు పట్టుకొని సమాజానికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. అలాంటి అధికారి పోలీసు వ్యవస్థకే కాదు దేశ అధికార వ్యవస్థలో ఉన్న అధికారులకు ఆదర్శ అధికారుడని ప్రశంసించారు. ఉద్యోగం అంటే కేవలం నామమాత్రంగా చేయడం కాదని ఉద్యోగం అంటే బాధ్యత పౌరులకు సేవలు అదించడం అనే విధంగా చదువుల యాదయ్య సమాజంలో ఉన్న ఉద్యోగులందరికీ ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. భగవాన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పి ఎస్ ఆర్ కె భగవాన్ మాట్లాడుతూ సమాజంలో కష్టపడి పనిచేసే అధికారులను గుర్తిస్తూ సమాజానికి నిస్వార్థంగా సేవలందించే వారికి తమ సంస్థ ప్రోత్సహిస్తుందని అందులో భాగంగానే చదువుల యాదయ్యను సన్మానించినట్లు తెలిపారు. సన్మాన గ్రహీత హెడ్ కానిస్టేబుల్ చదువుల యాదయ్య మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా తాను దొంగతో పోరాటం చేసి కత్తిపోట్ల గురై రక్తం మడుగుల్లో సైతం అవిశ్రాంతంగా తన విధి నిర్వహణను కొనసాగించానని తెలిపారు. దొంగ చేతిలో కత్తిపోట్ల గురైనప్పటికీ తాను చేసిన విధి నిర్వహణను సమర్ధవంతంగా నిర్వహించడంతోనే తనకు ఇలాంటి సన్మానాలు దక్కాయని తెలిపారు. తనకు ప్రత్యేకంగా సన్మానం చేసినందుకు భగవాన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత పి ఎస్ ఆర్ కే భగవాన్ వారి సహచర బృాఎందాన్ని కి కృాఎతజ్ఞతలు తెలిపారు హెడ్ కానిస్టేబుల్ చదువుల యాదయ్య. కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, పరస పరమేశ్వరరావు, నూకల సర్వారావు నాయుడు, అరవల రామకృాఎష్ణారావు, మిర్యాల రాఘవరావు, చందు శ్రీనివాసరావు, ఏవీ రత్నం, పార్థసారథి, డాక్టర్ కొల్లా వెంకట సుబ్బారావు, సీతారామయ్య, ఆనందరావు, డివి నాగేశ్వరరావు, డిఆర్ఆర్ రంగారావు, వెంకటరమణ, శివాజీ, ఠాగూర్, సూర్యనారాయణ, హెచ్ ఎన్ మూర్తి, ఐడిపిఎల్ నారాయణరావు, రమణ, చక్రపాణి, వీరవరం ప్రభాకర్, బందారు ఫణి నాథ్, బాలాజీ, దుర్గాప్రసాద్, అశోక్, కుమార్, శేషగిరిరావు రామకృాఎష్ణారెడ్డి సిహెచ్ సాంబశివరావు, డాక్టర్ అంకం శ్రీధర్, ఎంవీ రావు, డి కృాఎష్ణారావు, రజిని, డాక్టర్ సంతోష్, చక్రవర్తి, ఎంవీ రావు, శివరాం, ఎస్పీ నాయుడు, రాము, రామకృాఎష్ణ, కె వి వి సత్యనారాయణ, సంతు భూపతిరావు, రావూరి రామచంద్రరావు, చేవూరు సుబ్బారావు, శర్మ, నిమ్స్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు గడ్డం గుడ్ బై

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: బీఆర్ఎస్ సీనియర్ నేత, హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. ఆయన గతంలో హైదరాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గా పని చేశారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తన రాజీనామాను పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లకు పంపినట్లు తెలిపారు. తన అనుచరులు, అభిమానులతో చర్చించి ఏ పార్టీలో చేరాలనేది త్వరలో నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. ఇన్ని రోజులు తనకు సహకరించి తనతో నడిచిన హైదరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృాఎతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో వరద ముంపు బాధితులను ఆదుకునేందుకు తన వంతు కృాఎషి చేస్తానని ఆయన అన్నారు.

## పిసిసి అధ్యక్షుడు

## మహేష్ కుమార్ గౌడ్‌కు ఘన సత్కారం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: టిపిసిసి అధ్యక్షునిగా నియమితులైన ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఘన సత్కారాలు లభిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి నూతనంగా నియమింపబడ్డ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ గౌడ్ ను ఆదివారం ఎమ్మెల్యే క్వార్టర్స్ లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ నేతృాఎత్వంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ ను ఘనంగా సత్కరించారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గంధం యేసు రాజు కొప్పిశెట్టి దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తున్న హైడ్రా

● ఒకే రోజు మూడుచోట్ల అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన వైనం
● 208 విల్లాలను సీజ్ చేసి వాటికి అనుమతి లేదని నోటీసులు

తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: హైదరాబాద్ నగరంలో అక్రమ కట్టడాలను కూల్చివేసే పనిని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ టీమ్లు కొనసాగిస్తున్నాయి. మాదాపూర్లోని సున్నం చెరువు ఎఫ్టీఎల్లో నిర్మించిన అపార్ట్మెంట్ను కూల్చివేస్తున్నారు. మల్లంపేట కత్వా చెరువు, దుండిగల్లోని అనధికారిక విల్లాలను కూడా హైడ్రా కూల్చివేస్తోంది. ఎఫ్టిఎల్లోని మూడు నిర్మాణాలను, బఫర్ జోన్లోని 5 విల్లాలను హైడ్రా కూల్చివేస్తోంది. గత సోమవారం కత్వ చెరువులో లక్ష్మీ శ్రీనివాస కన్స్ట్రక్షన్ కంపెనీ అక్రమంగా నిర్మించిన విల్లాలను హైడ్రా అధికారులు పరిశీలించారు. సున్నం చెరువు మొత్తం వైశాల్యం 26 ఎకరాలు. చెరువులోని ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. వీటిలో భారీ షెడ్లు, భవనాలు ఉన్నాయి. హైడ్రా అధికారులు వాటిని కూల్చివేస్తున్నారు. సున్నం చెరువు ఎఫ్టీఎల్లో సర్వే నంబర్లు 12, 13, 14, 16లో పదుల సంఖ్యలో షెడ్లు నిర్మించి అక్రమార్కులు వ్యాపారాలు సాగిస్తున్నారు. భారీ నిర్మాణాల మధ్య ఈ కూల్చివేతలు కొనసాగుతున్నాయి. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని కత్వా సరస్సులోని 170/13.4,5 సర్వే నంబర్లలోని 8 విల్లాలను హైడ్రా అధికారులు ధ్వంసం చేశారు. అలాగే మల్లంపేట కత్వ చెరువు ఎఫ్ టీఎల్ విస్తీర్ణం 142 ఎకరాలు. ఇక్కడ, లక్ష్మీ శ్రీనివాస కన్స్ట్రక్షన్ 2020-21 సంవత్సరానికి 320 విల్లాలను నిర్మించింది. కానీ 60 విల్లాలకు మాత్రమే హెచ్ఎండీ అనుమతి తీసుకున్నారు. మరికొన్ని ఫోర్జరీ సంతకాలతో నిర్మించారని ఆరోపించారు. మేడ్చల్ కలెక్టర్ హరీశ్ నేతృాఎత్వంలో డీపీఓ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి 208 విల్లాలను సీజ్ చేసి వాటికి అనుమతి లేదని నోటీసులు జారీ చేశారు. వీటికి కరెంట్ కనెక్షన్, నీటి కనెక్షన్, రిజిస్ట్రేషన్, బ్యాంకు అధికారుల నుంచి రుణాలు నిలిపివేస్తూ హైకోర్టు ఆర్డినెన్స్ ఇచ్చింది. మాదాపూర్ అయ్యప్ప సొసైటీ లో హైడ్రా అధికారులు మరో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్నారు. రెండేళ్ల క్రితం కూల్చివేసిన మున్సిపల్ అధికారులు.. మళ్ళీ యజమాని నిర్మాణం చేపట్టారు. అనుమతులు లేకుండానే జీ+2



నిర్మాణం చేపట్టడంతో హైడ్రా అధికారులు ఎంట్రీ ఇచ్చారు. కూల్చివేసిన మళ్లీ నిర్మాణం చేపట్టారని కూల్చివేశారు అధికారులు. ఇక మరోవైపు షబ్బీర్ భాయ్ బిర్యానీ వాలా హోటల్ ను కూల్చివేస్తున్నారు. దీంతో హోటల్ యజమాని అడ్డుకున్నారు. ఇది అక్రమ నిర్మాణమని అందుకే కూల్చేస్తున్నట్లు తెలిపారు. దీంతో భారీగా స్థానికులు మోహరించడంతో పోలీసులు చెదరగొడుతున్నారు.

## కేంద్ర రవాణా చట్టంలో

# మరిన్ని సంస్కరణలు


తెలంగాణ బ్యూరో ప్రతినిధి: తెలంగాణ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్తో నిర్వహించిన సమావేశంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కేంద్ర రవాణా చట్టానికి అనుబంధంగా మరిన్ని సంస్కరణలు తీసుకురాబోతున్నామన్నారు. 1988 కేంద్ర వాహన చట్టానికి.. సుప్రీం కోర్ట్ సూచనలను పరిగణనలోకి తీసుకుంటున్నామని, రాష్ట్రంలో యాక్సిడెంట్స్ ను తగ్గించడానికి ప్రత్యేక నిబంధనలు అమల్లోకి రాబోతున్నాయని ఆయన తెలిపారు. ఉద్యోగుల్లో అసహనం తొలగించడానికి పెండింగ్ సమస్యలు.. ప్రమోషన్స్ చేపడుతామని, చట్టాన్ని కఠినం చేస్తూనే.. రవాణా శాఖ ఆదాయాన్ని పెంచుతామన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. ఏప్రిల్ నుంచి ఆగస్ట్ వరకు 6916 లైసెన్సులు రద్దు చేశామని ఆయన తెలిపారు. అంతేకాకుండా.. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టం తీసుకువస్తున్నామని, యాక్సిడెంట్స్ నివారణ.. ఉద్యోగుల ఫిట్నెస్ కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్ సేఫ్టీ సరిచేస్తూ.. నిబంధనలను కఠినం చేయడానికి ట్రాన్స్పోర్ట్ విజిలెన్స్ స్ట్రిక్ట్ గా పని చేస్తుందని ఆయన తెలిపారు.

## జిల్లా కలెక్టర్లను
# అప్రమత్తం చేసిన సీఎం
### అల్పపీడనం ప్రభావంతో వర్షాలు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో శని, ఆదివారాల్లో కురుస్తున్న వర్షాలు, ఆయా జిల్లాల్లో పరిస్థితులపై జిల్లా కలెక్టర్లను, అధికార యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ లో అప్రమత్తం చేశారు. జిల్లాల వారిగా నమోదైన వర్షపాతం వివరాలను టెలీకాన్ఫరెన్స్ లో కలెక్టర్లు సీఎంకు వివరించారు. తమ తమ జిల్లాల్లో ప్రస్తుత పరిస్థితులు, తీసుకుంటున్న చర్యలను కలెక్టర్లు చెప్పారు. దీనితో సీఎం చంద్రబాబు వారికి కొన్ని సూచనలు చేశారు. జిల్లాల్లో నమోదైన వర్షపాతాన్ని అంచనా వేసుకుని చర్యలు తీసుకోవాలని, సోమవారం కూడా కూడా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షాల ప్రభావం అధికంగా కనిపిస్తోందని, ఏలేరు రిజర్వాయర్ కు ఎక్కువ వరద వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రాజెక్టు స్టోరేజ్ కెపాసిటీని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలన్నారు. ప్రాజెక్టుల్లోకి వచ్చే ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో బ్యాలెన్స్ చేసుకుని సమర్ధవంతంగా ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టాలని, కాలువలు, చెరువులు, డ్రెయిన్లకు గండ్లు పడకుండా చూసుకోవాలన్నారు. భారీ, అతిభారీ వర్షాలు పడేందుకు అవకాశం ప్రాంతాల్లో తాగునీరు, ఆహారం, మెడికల్ క్యాంప్ లకు సిద్ధంగా ఉండాలన్నారు. పునరావాస కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి. వరద ప్రభావిత ప్రాంత ప్రజలకు నచ్చజెప్పి పునరావాస కేంద్రాలకు తరలించాలి. పరిస్థితి తీవ్రతను బట్టి సహాయం కోసం సెంట్రల్ కంట్రోల్ టీంను సంప్రదించాలన్నారు. ఏజెన్సీలో భారీ వర్షాలు, వాగులు వంకల పరిస్థితిపై అధికారులు నిరంతరం సమాచారం తెప్పించుకోవాలన్నారు. ఎగువ ప్రాంతాల నుండి వరద వస్తే ఒక జిల్లా నుండి మరో జిల్లా అధికారులు సమన్వయం చేసుకోవాలని, వరద, భారీ వర్షాలపై ప్రజల ఫోన్లకు అలర్ట్ మెసేజ్ లు పంపించాలని వివరించారు. వాగులు, వంకలు దాటే సమయంలో ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా ఆంక్షలు విధించాలని ఆదేశాలు జారీ చేశారు. విజయనగరం జిల్లాలో నిన్న, నేడు భారీ వర్షాలున్నాయని, దానికి అనుగుణంగా రాకపోకలను బ్రిడ్జిలపై నియంత్రిస్తున్నామని, ప్రజలకు అవసరమైన సమాచారం ఇస్తున్నామన్న విజయనగరం జిల్లా కలెక్టర్ తెలిపారు. నాగావళి, వంశధార నదులకు వరద పెరిగే అవకాశం ఉందన్న అంచనాలకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

# ప్రజలను ఆదుకుంటాం

- వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: శనివారం వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించి ప్రజలను ఆదుకుంటామని భరోసానిచ్చారు. శనివారం విజయవాడలోని భవానీపురం, సితార సెంటర్, చిట్టి నగర్, ఎర్రకట్ట, మ్యాంగో మార్కెట్, సింగ్ నగర్ తదితర వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. బాధిత ప్రజల కష్టాలను స్వయంగా పరిశీలించారు. నీటి ప్రవాహాలు చూసారు. సింగ్ నగర్ లో వరద నీరు తగ్గకపోవడంతో ప్రొక్లెయినర్ ఎక్కి మారుమూల ముంపు ప్రాంతాలకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. భారీ వర్షం, వరద నీటిలోనూ 3 గంటల పాటు పర్యటించిన ముఖ్యమంత్రి వరద బాధితులతో స్వయంగా మాట్లాడారు. ఆహారం, నీరు సరఫరాపై ఆరా తీశారు. అనంతరం సింగ్ నగర్ నుండి నందమూరి నగర్, న్యూ ఆర్ఆర్ పేట, ఓల్డ్ ఆర్ఆర్ పేట, పైపుల రోడ్డుకు చేరుకున్నారు. ఆయా ప్రాంతాల బాధిత ప్రజలు సీఎంతో తమ బాధలు, ఇబ్బందులు చెప్పుకున్నారు. ఆహారం, నీరు దొరుకుతున్నా వరద ముంపుతో తాము తీవ్రంగా నష్టపోయామని సీఎం వద్ద మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో ఉన్న వస్తువులు, వాహనాలు వరద కు దెబ్బ తిన్నాయని, తమను ఆదుకోవాలని మహిళలు సీఎం ను కోరారు. గండ్లు పూడ్చివేత పూర్తనందున రేపు లేదా ఎల్లుండి ఉదయానికి వరద సమస్య పరిష్కారం అవుతుందని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజలంతా ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని బాధితులకు భరోసా ఇచ్చారు. అక్కడి నుండి తిరిగి కాన్వాయ్ లో కలెక్టరేట్ కు చేరుకున్నారు. మూడు గంటల పాటు పర్యటించి ఆయా ప్రాంతాల్లో ముఖ్యమంత్రి పరిశీలన జరిపారు.

## ఎట్టకేలకు బుడమేరు గండ్లు పూడ్చివేత

- నిబద్ధతతో పని చేసిన మంత్రి నిమ్మల
- అటు సీఎం, ఇటు లోకేష్ సూచలను పరిగణలోకి తీసుకుని
- స్థానిక నేతలు, మాజీ మంత్రి దేవినేని సహకారంతో కార్యక్రమం పూర్తి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఎట్టకేలకు బుడమేరుకు పడిన మూడు గండ్లను రాష్ట్ర ప్రభుత్వం పూడ్చివేసింది. శనివారం సాయంత్రానికి కల్లా మూడో అతిపెద్ద గండిని పూడ్చినట్టు ఇరిగేషన్ శాఖ ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది. వారం రోజుల నుంచి ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గండ్లు పడిన ప్రాంతాల్లోనే ఉన్నారు. రాత్ర పగలు, వర్షాన్ని కూడా లెక్క చేయకుండా సైట్ లోనే ఆయన ఉన్నారు. మంత్రిగా తొలిసారి ఆయన బాధ్యతలు స్వీకరించినప్పటికీ, నిబద్ధతతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పగించిన పనిని పూర్తి చేశారు. మంత్రి లోకేష్ సూచనలు, సలహాలతోపాటు ఆర్మీ సిబ్బంది, స్థానిక ప్రజల అండదండలతో గండిని పూడ్చివేత కార్యక్రమాన్ని పూర్తి చేయించారు. ఇరిగేషన్ శాఖ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు బుడమేరు పుట్టుపూర్వోత్తరాలు పూర్తిగా తెలియడంతో, ఆయన సలహాలను మంత్రి నిమ్మల తీసుకున్నారు. దేవినేని ఉమా కూడా సాగునీటిశాఖ మంత్రిగా చేసిన అనుభవంతో అటు ప్రకాశం బ్యారేజి గేట్ల మరమ్మతులు, ఇటు బుడమేరు గండ్లు పూడ్చివేతకు తన వంతు సహకారాన్ని అందించారు.

## బ్యారేజ్ కౌంటర్ వెయిట్‌లను ఢీకొట్టిన బోట్ల సంఘటనలో కుట్ర కోణం?

- పోలీసుల ప్రాథమిక విచారణలో వెలుగులోకి వైసీపీ నేతల పేర్లు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ప్రకాశం బ్యారేజ్ కౌంటర్ వెయిట్‌లను బోట్లు ఢీకొట్టిన ఘటనపై వైసీపీ నేతల హస్తం అందనే అంచనాకు పోలీసులు వస్తున్నారు. అసలు ఈ బోట్లు ఎవరివి? వాటిని ఎవరు నడువుతున్నారు? అనే కోణంలో పోలీసులు లోతైన దర్యాప్తు జరుపుతున్నారు. ఈ బోట్లు శేషాద్రి, కోమటి రామ్మోహన్ నిర్వహిస్తున్నారని, వీటిని వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేష్ నడువుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. కోమటి రామ్మోహన్ వైసీపీ నేత తలశిల రఘురాం మేనల్లుడు అని ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ బోట్లను కావాలని వదిలారా? లేక ఎలా వచ్చాయి? అనే అంశంపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. జలవనరుల శాఖ ఇచ్చిన ఫిర్యాదుపై పూర్తి స్థాయి దర్యాప్తు జరుగుతోందని హోమ్ మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. ప్రకాశం బ్యారేజీకి వెళ్లి బోట్లు ఢీ కొట్టడంతో కౌంటర్ వేయిట్లు విరిగిపోయిన ప్రాంతాన్ని ఆమె స్వయంగా పరిశీలించారు. కాగా ఈ కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. వైసీపీ నేతల కుట్ర ఉందంటూ అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా బ్యారేజ్‌ను ఢీకొట్టిన బోట్లకు 5 సంవత్సరాల నుంచి ఎలాంటి అనుమతులు లేవని తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా వీటిని నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. వైసీపీ పెద్దల హస్తంతో ఇష్టానుసారంగా ఐదేళ్లుగా ఇసుక తవ్వకాలు చేపట్టిన విషయం తెలిసిందే. 2019 లో జరిగిన పడవ ప్రమాదానికి సంబంధించి కూడా ఎటువంటి విచారణ జరగలేదు. అప్పటి బోటు ప్రమాదంపై కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## తెలంగాణలో దేశంలోనే అతిపెద్ద వినాయకుడి విగ్రహం

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: రాష్ట్ర వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఊరు వాడ మొత్తం గణేశుని నామస్మరణంతో మారుమోగుతోంది. లంబోధరుడిని వివిధ రూపాల్లో కొలువుతీర్చి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గణేష్ మండపాల వద్ద విద్యుత్ కాంతుల శోభతో ప్రత్యేక కళను సంతరించుకున్నాయి. రాష్ట్రంలో ఏ గ్రామంలో చూసినా వివిధ రూపాల్లో వినాయకుని విగ్రహాలు కళకళలాడుతున్నాయి. గణేష్ మండపాల వద్దకు పెద్ద ఎత్తున చేరుకుని భక్తులు పూజలను నిర్వహిస్తున్నారు. ఈ సారి కొన్ని వినాయక విగ్రహాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కాగా.. దేశంలోనే అతిపెద్ద వినాయకుడి విగ్రహం తెలంగాణ రాష్ట్రంలో ఉంది. పూర్తి వివరాలు తెలుసుకుందాం.. నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం అవంఛలో ఈ గణేషుడి విగ్రహం ఉంది. ఇది దేశంలోనే అత్యంత పురాతన ఏకశిలాతో చేసిన గణపతిగా పేరుంది. ఈ గణేషుడి విగ్రహం 9వ శతాబ్దానికి చెందినదిగా చరిత్రకారులు చెబుతున్నారు. విగ్రహం ఎత్తు 30 అడుగులు కాగా.. వెడెల్పు 15 అడుగులు. కొత్త తెలంగాణ చరిత్ర బృాఎందం అధ్యక్షుడు శ్రీరామోజు హరగోపాల్ ప్రకారం సుమారు 879 ఏండ్ల కిందట అంటే క్రీ.శ 1140లో ఈ విగ్రహాన్ని తైలంవుడు అనే రాజు ఏకశిలపై చెక్కించాడు. ప్రస్తుతం కర్ణాటకలోని గుల్బర్గా జిల్లాగా పిలవబడుతున్న ప్రాంతం అప్పట్లో బాదామి రాజ్యంగా ఉండేది. మహబూబ్ నగర్ జిల్లా అవంఛ గ్రామా శివారుల్లో ఉన్న ఈ విగ్రహాన్ని చూసేందకు జనాలు గుంపులు గుంపులుగా తరలి వస్తున్నరు. ఇదిలా ఉండగా.. కళ్యాణ చాళుక్యుల కాలంలోనే క్రీస్తు శకం 11 శతాబ్దంలో చెక్కిన మరొక విగ్రహం, సిద్దిపేట జిల్లాలోని బైరాన్ పల్లి గ్రామంలో ఉంది.

## సీఎం సహాయ నిధికి ఏపీ పోలీసు అధికారుల సంఘం భారీ విరాళం



విజయవాడ: ముఖ్యమంత్రి చంద్రబాబు పిలువు మేరకు వరద బాధితుల సహాయం కోసం సీఎం సహాయ నిధికి పెద్ద ఎత్తున దాతలు విరాళాలు అందిస్తున్నారు. ఆదివారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లో సీఎం చంద్రబాబును కలిసి విరాళాలు అందించారు. ఏపీ పోలీసు అధికారుల సంఘం రూ.11,12,50,000 విరాళం ఇచ్చింది. దీపక్ నెక్స్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత ఏవీ సుబ్రహ్మణ్యం కోటి రూపాయలు వాటర్ సప్లై కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రూ.50 లక్షలు వై.రాజారావు రూ.10 లక్షలు, కె.సాంబశివరావు రూ.5 లక్షలు, సి.టి.చౌదరి రూ.2.55లక్షలు శ్రీ కోవిల్ ఫ్లాట్స్ ఒనర్స్ రెసిడెంట్ అసోసియేషన్ రూ.2.21లక్షలు వెలగపూడి సత్యనారాయణ రూ.2లక్షలు. ఎమ్.శ్రీనివాసరావు రూ.2లక్షలు, వువ్వాడ రామకృాఎష్ణ రూ.2లక్షలు, సీహెచ్.శివరామకృాఎష్ణ రూ.1.32లక్షలు, నవీన్ బాబు రూ.1.16లక్షలు, జాస్తి శైలజారాణి రూ.లక్ష. శాంభవి రూ.లక్ష, జె.శశాంక్ చౌదరి రూ.లక్ష, ఎస్.సాంబశివరావు రూ.లక్ష, దూళిపాళ్ల రామకృాఎష్ణ రూ.లక్ష, డాక్టర్ యు.గంగాధర్ రెడ్డి రూ.లక్ష, చెరుకూరి వెంకటరావు రూ.లక్ష, జె.సత్యనారాయణ మూర్తి రూ.లక్ష, ఎన్.నాగేశ్వరరావు రూ.70 వేలు, రాణి శారదా రూ.50వేల విరాళం చెక్కును సీఎంకు అందించారు. వరద బాధితులను ఆదుకునేందుకు సాయం అందిస్తున్న దాతలకు చంద్రబాబు కృాఎతజ్ఞతలు తెలిపారు.

## బీసిలు రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: బీసీ ఇంటల ెక్చువల్ ఫోరం కన్వీనర్ చిరంజీవి ఆధ్వర్యంలో ఆదివారం బేగంపేట లోని హోటల్ మనోహర్ లో జరిగిన బిసి రాజ్యా. దికారమే ధ్యేయంగా భవిష్యత్తు లో ఏ విధంగా బీసీల పాత్ర ఉండాలి, మనం చేసే కార్యక్రమాలు ఏ విధంగా ప్రజల్లోకి తీసుకుపోవాలి తదితర అంశాలపై జరిగిన సమావేశంలో పాల్గొన్న బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం .శ్రీనివాస్ సాగర్ ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐపీఎస్ పూర్ణచంద్రరావు, ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనుమంతరావు, కరీంనగర్ మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ, బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు తో పాటు వివిధ బీసీ సంఘ నాయకులు, రాజకీయ నాయకులు, మేధావులు, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

## కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో ఆర్ సత్యనారాయణ?

- ఆరేళ్ల ఎమ్మెల్సీ పదవి 9 నెలలకే త్యాగం
- జర్నలిస్టుగా ఉద్యమకారునిగా గుర్తింపు
- ఎమ్మెల్సీకి రాజీనామాతో తెలంగాణ ఉద్యమానికి ఊతం
- ఉద్యమకారులకు అవకాశం కల్పించి బిఆర్ఎస్‌కు చెక్ పెట్టే యోచనలో కాంగ్రెస్ పార్టీ
- ఆర్ సత్యనారాయణ పోటీ చేస్తే కాంగ్రెస్ పార్టీకి గెలుపు నల్లేరు మీద నడకే



తెలంగాణ బ్యూరో ప్రతినిధి; తెలంగాణ ఉద్యమానికి ఊతమిచ్చిన కరీంనగర్ గడ్డలో త్వరలో జరగబోయే కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీనియర్ జర్నలిస్టు మాజీ ఎమ్మెల్సీ ఆర్ సత్యనారాయణ పోటీ చేయాలని ఒత్తిడి పెరుగుతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో కరీంనగర్ పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన ఆర్ సత్యనారాయణ ఉద్యమ ప్రస్థానంలో భాగంగా 9 నెలలకే తన పదవిని రాజీనామా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుంది. ఇటు ఉద్యమకారులకు అవకాశం కల్పిస్తూ అటు బిఆర్ఎస్ పార్టీకి చెక్ పెట్టేందుకు ప్రయత్నిస్తుంది. ఆర్. సత్యనారాయణ సీనియర్ జర్నలిస్టుగా మాజీ ఎమ్మెల్సీగా అందరికీ సుపరిచితుడు. ఉన్నత ఉన్నత విద్యాభ్యాసాన్ని పూర్తిచేసి న్యాయ పట్టా పొందిన ఆర్ సత్యనారాయణ ఆగస్టు1987 నుండి మార్చి 1991 వరకు ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఈనాడు బ్యూరో ఇన్ ఛార్జ్ గా బాధ్యతలు నిర్వహించారు. దాదావు రెండున్నర సంవత్సరాలు సమాజానికి ఉపయోగపడే కథనాలు రాసి సామాజిక చైతన్య స్ఫూర్తిని నింపారు. ప్రత్యేకంగా అసమానతలు రూపుమాపడానికి అట్టడుగు స్థాయిలో ఉన్న ఆదివాసీలు, గిరిజనులు, గోండు అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఆర్ సత్యనారాయణ రాసిన కథనాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి అని చెప్పవచ్చు. జర్నలిస్టుగా గూడాలను తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకొని వారి జీవనశైలిని మార్చేందుకు అధికారుల దృాఎష్టికి తీసుకువచ్చి, చైతన్య పరిచేందుకు కృాఎషి చేశారు. అడవుల్లో ఉన్న ఆదివాశిలను మైదాన ప్రాంతాలకు తరలించాలని ఫారెస్ట్ అధికారులు ప్రయ త్నిస్తే ఆదివాసుల పక్షాన పోరా టం చేసి వారికి అండగా నిలిచా రు. ఆదివాసి హక్కుల కోసం పోరాటం చేసే సంస్థలు, వ్యక్తు లపై టాడా కేసులు నమోదు చేస్తే ఆదివాసి ల పక్షాన పౌరహక్కుల సంఘాల నేతలను రప్పించి పోరాటాలు చేయించడంలో కీలక భూమిక పోషించారు. అదేవిధంగా అట్టడుగు స్థాయిలో ఉన్న వారు నిరక్షరాశులుగా ఉండకూడదంటూ ప్రతి ఒక్కరికి చదువు రాజ్యాంగం ఇచ్చిన హక్కు అంటూ విద్యా వ్యాప్తి కోసం ఆర్ సత్యనారాయణ చేసిన కృాఎషి ఎంతో గొప్పది. సమాజంలో సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థలను ఏర్పాటు చేయించి నిరుపేదలకు ప్రభుత్వాలకు వారధిగా ఉండాలని ఎంతోమందిని ప్రోత్సహించిన ఘనత ఆర్ సత్యనారాయణది. కార్మికులు, కర్షకుల పక్షాన సైతం నిలబడి వారి హక్కులు, అసంఘటిత కార్మిక పక్షపాతిగా జర్నలిస్టుగా తన వంతు బాధ్యత పోషించారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంస్థలతోపాటు జర్నలిస్టు సంఘాల్లో సైతం హక్కుల సాధన కోసం చేస్తున్న పోరాటాలకు మద్దతుగా నిలిచారు. ప్రభుత్వాలు ప్రజలపై పన్నుల భారం మోపిన సమయాల్లో మేధావులను కూడగట్టి నిరసన కార్యక్రమాలు చేయించి ప్రజల పక్షాన నిస్వార్థంగా నిలిచిన సీనియర్ జర్నలిస్ట్ ఆర్ సత్యనారాయణ. ప్రజా జీవనంలో జర్నలిస్టుగా ఉద్యమకారునిగా రాజకీయ నేతగా సేవలందిస్తున్న ఆర్ సత్యనారాయణ లాంటి నాయకునికి కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పట్టభద్రుల ఎన్నికల్లో అభ్యర్థిగా అవకాశం ఇస్తే గెలువు సునాయసమని మేధావి వర్గం భావిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లే అధికార పార్టీ గెలువు గుర్రానికే అవకాశం ఇస్తుందని ఆశిద్దాం.

## వరద బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛందంగా కదిలొస్తున్న దాతలు

- ముఖ్యమంత్రిని కలిసి పలువురు విరాళాలు అందజేత

అమరావతి :- వరద బాధితులను ఆదుకునేందుకు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. పారిశ్రామిక వేత్తలు, డాక్టర్లు, చలన చిత్ర ప్రముఖులు, విద్యారంగ ప్రముఖులు, ప్రవాస భారతీయులు పెద్దఎత్తున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి విరాళాలు అందజేస్తున్నారు. ఆపన్న హస్తం అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న దాతలకు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ లో సీఎం చంద్రబాబును కలిసి ఆదివారం పెద్ద ఎత్తన విరాళాలు అందించారు. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ తమకు తోచిన విధంగా సాయం అందిస్తున్న దాతలకు సీఎం కృాఎతజ్ఞతలు తెలిపారు. 1. ఏపీ పోలీస్ అధికారుల సంఘం రూ.11 కోట్ల 12 లక్షల 50 వేలు 2. దీపక్ నెక్స్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత ఏవీ సుబ్రహ్మణ్యం రూ.1 కోటి 3. వాటర్ సప్లై కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రూ.50 లక్షలు 4. వై.రాజారావు రూ.10 లక్షలు 5. కె.సాంబశివరావు రూ.5 లక్షలు 6. సీహెచ్.వూర్ణ బ్రహ్మయ్య రూ.5 లక్షలు 7. డాక్టర్ శరత్ బాబు రూ.5 లక్షలు 8. సి.టీ. చౌదరి రూ.2 లక్షల 55 వేలు 9. శ్రీ కోవిల్ ఫ్లాట్స్ ఒనర్స్ రెసిడెంట్ అసోసియేషన్ రూ.2 లక్షల 21 వేల 116 10. వెలగవూడి సత్యనారాయణ రూ.2 లక్షల 116 లు 11. ఎమ్.శ్రీనివాసరావు రూ.2 లక్షలు 12. వువ్వాడ రామకృాఎష్ణ రూ.2 లక్షలు 13. సీహెచ్.శివరామ్ కృాఎష్ణ రూ.1 లక్షా 32 వేలు 14. బి.నవీన్ బాబు రూ.1 లక్షా 116లు 15. జాస్తి శైలజారాణి రూ.1 లక్ష 16. జె.శాంభవి రూ.1 లక్ష 17. జె.శశాంక్ చౌదరి రూ.1 లక్ష 18. ఎస్.సాంబశివరావు రూ.1 లక్ష 19. ధూళిపాళ్ల రామకృాష్ణ రూ.1 లక్ష 20. డాక్టర్ యు.గంగాధర్ రెడ్డి రూ.1 లక్ష 21. చెరుకూరి వెంకటరావు రూ.1 లక్ష 22. జె.సత్యనారాయణ మూర్తి రూ.1 లక్ష 23. ఏపీ ప్రదేశిక్ మార్వాడి సమ్మేలం రూ.1 లక్ష 24. ఎన్.నాగేశ్వరరావు రూ.70 వేలు 25. రాణి శారదా రూ.50 వేలు 26. పమిడి భానుచందర్ రూ.50 వేలు 27. నూతక్కి వాణి రూ.50 వేలు 28. గుత్తికొండ వెంకటేశ్వరరావు రూ.50 వేలు 29. కె.భవానీ రూ.35 వేలు 30. దేవినేని సుధారాణి రూ.30 వేలు 31. వి.రామకృాఎష్ణ రూ.25 వేలు 32. ఎమ్.అరుణ కుమారి రూ.25 వేలు33. యలమంచిలి నలిని కుమారి రూ.25 వేలు 34. మోహిత్ చక్రి తరుష్ రూ.20 వేలు 35. గద్దె ఝాన్సీరాణి రూ.10 వేలు 5:48 , 9/8/2024 : వాటర్ సప్లై కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రూ.50 లక్షలు.

# ఇదీ చంద్రబాబు స్కూల్ అంటే

- పని తీరే ప్రామాణికం..
- రాష్ట్రంలో కనిపిస్తున్న స్పష్టమైన మార్పు
- ముంపు ప్రాంతాల్లో స్వయంగా పర్యటించిన సిఎం
- ప్రజల సాధక బాధకాల్లో పాలుపంచుకుంటున్న మంత్రులు
- సిఎంకు బాసటగా నిలుస్తున్న అధికార యంత్రాంగం



అమరావతి : జగన్ హయాంలో ఐదేళ్ల పాటు ఆంధ్రప్రదేశ్ లో అరాచకం తాండవించింది. దాడులకు, దౌర్జన్యాలకూ రాష్ట్రం కేరాఫ్ అడ్రస్ గా మారిపోయింది. తప్పులు చేసిన వారిపై చర్యలు లేవు.అకృాఎత్యాలకూ, అత్యాచారాలకు, హత్యలకు పాల్పడిన వారిపై కేసులు లేవు, ,చర్యలు లేవు సరికదా ఎదురు బాధితులే వేధింపులకు గురైన పరిస్థితి. వరదలు, తుపానులు వంటి విపత్తులు జరిగిన సమయాలలో ప్రభుత్వం నుంచి స్పందన లేదు, సహకారం లేదు. అసలా ఐదేళ్లూ రాష్ట్రంలోఅసలు ప్రభుత్వం అనేది ఉందా అన్నట్లుగా పరిస్థితులు ఉన్నాయి. ఇప్పుడు రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం కూటమి అధికారంలో ఉంది. జవాబుదారీ తనంతో పని చేస్తున్నది. ప్రజల పట్ల బాధ్యతతో వ్యవహరిస్తున్నది. జగన్ ప్రభుత్వం దిగిపోయి, తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చిన నిండా మూడు నెలలు కాలేదు. అయినా రాష్ట్రంలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. అభివృాఎద్ధి ఉరకలేస్తోంది. సంక్షేమం నిజమైన అర్థం ఏమిటో తెలిసేలా పథకాలు అమలు అవుతున్నాయి. ప్రజలు కష్టాలలో ఉన్నప్పుడు ప్రభుత్వ వారిని అన్ని విధాలుగా ఆదుకుంటోంది. మూడు నెలలలోనే ఇంతటి మార్పునకు కారణమేంటి? అంటే లభించే జవాబు. నాయకత్వం. సమర్థుడైన నాయకుడు తాను కష్టపడటమే కాదు... తన టీమ్ ను సైతం సమర్ధంగా పని చేసేలా గైడ్ చేస్తారు. ప్రభుత్వం, పాలనా అన్నది ఒక సమష్టి బాధ్యత అన్న భావన అందరిలో కలిగిస్తారు. టీమ్ స్పిరిట్ అన్నది అందరిలోనూ నింపుతారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే.. ఒక స్కూల్ లో ప్రధానోపాధ్యాయుడు సమర్థుడైతే.. ఆయన ఆలోచనలకు, సూచనలకు అనుగుణంగా ఉపాధ్యాయులు సైతం విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతారు. అందు కోసం శ్రమిస్తారు. తద్వారా విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బలమైన పునాదులు పడతాయి. అదే తరహాలో ప్రభుత్వాన్ని నడిపించే ముఖ్యమంత్రి సమర్థుడైతే మంత్రివర్గం, నాయకులు ప్రజలకు అండగా నిలుస్తారు. ప్రజల సాధక బాధకాల్లో పాలుపంచుకుంటారు. ప్రస్తుతం ఏపీలో సరిగ్గా అలాంటి సమర్థ ముఖ్యమంత్రి నేతృాఎత్వంలోని ప్రభుత్వమే ఉంది. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృాఎద్ధి వేగంగా జరుగుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృాఎషి చేస్తున్నారు. అదే సమయంలో అభివృాఎద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు. కష్టం వస్తే సమష్టిగా కదిలి బాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. కనీవినీ ఎరుగని రీతిలో విజయవాడను భారీ వర్షాలు వరదలూ ముంచెత్తి రోజుల తరబడి ప్రజలు ముంపులో చిక్కుకుంటే.. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కదిలింది. బాధితులను ఆదుకుంది. భరోసా ఇచ్చింది. ధైర్యం చెప్పింది. కష్టాలలో తాము ఒంటరిగా లేమన్న ధీమాను జనంలో కలిగించింది.

ప్రకాశం బ్యారేజీ వద్ద రికార్డు స్థాయిలో వరద ప్రవాహం రావడం, ఎన్నడూ లేని విధంగా బుడమేరు పోంగి పొర్లడం.. మూడు ప్రాంతాల్లో గండ్లు పడటంతో విజయవాడలోని అనేక ప్రాంతాలు నీట మునిగాయి. మనిషి లోతు నీళ్లు చేరాయి. అప్రమత్తమైన సీఎం చంద్రబాబు నాయుడు వరదనీరు వచ్చిన కొద్ది గంటల నుంచే ముంపు ప్రాంతాల్లో స్వయంగా పర్యటించి ముంపు బాధితులకు భరోసా ఇవ్వడమే కాకుండా సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఏడు రోజులుగా ముంపు బాధితులకు ప్రభుత్వం ఆహారం, కూరగాయలు, పాలు, పండ్లు అందిస్తూ వారికి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నారు. ముంపు బాధితులలో ధైర్యాన్ని నింపారు. నేనున్నా అన్న భరోసా ఇచ్చారు. ఇప్పుడిప్పుడే వరద తగ్గుముఖం పడుతుండటంతో ముంపు ప్రాంతాల ప్రజలు ఊపిరిపీల్చుకుంటున్నారు.

విజయవాడను వరద ముంచెత్తిన విషయం పక్కనపెడితే.. వరద ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయక చర్యలను చూసి దేశం మొత్తం ఆశ్చర్యపోతుంది. ఆపత్సమయాలలో ప్రజలను ఆదుకునే తీరు ఇదే అంటూ ప్రశంసలు గుప్పిస్తోంది. సమర్థ సీఎం ఉంటే.. ఆ రాష్ట్ర ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా ఇబ్బంది ఉండదన్న విషయాన్ని చంద్రబాబు నాయుడు దేశానికి మరోసారి చాటి చెప్పారు. విజయవాడ ముంపు బాధితులను ఆదుకోవడంలోనూ, వారికి ధైర్యం చెప్పి భరోసా ఇవ్వడంలోనూ చంద్రబాబే ఒక సైన్యంగా, ఒక ధైర్యంగా నిలబడ్డారు. జాతీయ మీడియా సైతం సీఎం చంద్రబాబు నాయుడు వరద ప్రాంతాల్లో పర్యటిస్తుండటం, మంత్రివర్గం, అధికారులు, ఎమ్మెల్యేలు ముంపు ప్రాంతాల్లో ప్రజలకు అండగా నిలుస్తున్న తీరుపై ప్రశంసల వర్షం కురిపిస్తోంది. ముఖ్యంగా విజయవాడ నగరంలోకి వరద రావడానికి కారణమైన బుడమేరుకు పడిన మూడు గండ్లను దగ్గరుండి పూడ్చివేయించే బాధ్యతలను సీఎం చంద్రబాబు నాయుడు నీటిపారుదల శాఖ మంత్రి రామానాయుడుకు అప్పగించారు. చంద్రబాబు ఆదేశాల మేరకు రాత్ర, పగలు అనే తేడాలేకుండా.. వర్షం, చలిని లెక్క చేయకుండా గండ్ల వద్దనే ఉండి దగ్గరుండి పనులు వేగంగా చేయించారు. మూడు రోజుల్లోనే మూడు గండ్లను పూడ్చివేసి శెభాష్ రామానాయుడు అనిపించుకున్నారు. ఒక్క రామానాయుడే కాదు.. మంత్రివర్గం, తెలుగుదేశం ఎమ్మెల్యేలు ముంపు ప్రాంతాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలను చూసి రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు గర్వంగా ఉందంటూ పొంగిపోతున్నారు. నిర్మల రామానాయుడుతో పాటు.. మంత్రివర్గం మొత్తం వరద సహాయక చర్యల్లో నిమగ్నమైంది. గతవారం రోజులుగా మంత్రి నారా లోకేశ్ వరద ప్రాంతాల్లో పర్యటిస్తూ, కంట్రోల్ రూమ్ ఉండి వరద ప్రాంతాల్లో అందుతున్న సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఆర్టీజీఎస్ శాఖ మంత్రిగా లోకేష్ రియల్ టైమ్ గవర్నెన్స్ పవరేంటో చూపారు. వరద ఉధృాఎతంగా ఉన్న మూడురోజులు తన నియోజకవర్గంలో కరకట్టకు కాపలాకాసిన పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వరద తగ్గిన వెంటనే రంగంలోకి దిగి రాష్ట్ర నలుమూలల నుంచి నిత్యావసర సరుకులు తెప్పించి, బాధితులకు అందించే పనిలో ఉన్నారు. ఇక రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ రెండు రోజుల పాటు తన నియోజకవర్గంలో కట్టకు కాపలాకాసి, తర్వాత నుంచి గండ్లువూడ్చే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, తన జిల్లాలో కట్టకు గండి పడకుండా అప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. వానలో వరదలో ఆయన ప్రజల మధ్యనే నిలిచారు. వరద తగ్గుముఖం పట్టగానే ముంపు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా వునరుద్ధరణ చర్యలపై దృాఎష్టిపెట్టారు. అత్యంత వేగంగా విద్యుత్ సరఫరాను వునరుద్ధరించేలా చూశారు. మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ వరద ప్రాంతాల్లోనే మకాం వేశారు. ప్రజలకు ఏ కష్టం రాకుండా కావు కాశారు. ముంపు తగ్గిన తరువాత ఆయా ప్రాంతాలలో పారిశుద్ధ్యంపై దృాఎష్టి పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల నుంచి పారిశుద్ధ్య సిబ్బందిని రప్పించి ముంపు ప్రాంతాల్లో క్లీనింగ్ చేయిస్తున్నారు. విపత్తులశాఖ కూడా చూసే హోమ్ అనిత అయితే విశ్రాంతి అనే మాటే లేకుండా చంద్రబాబు వెంట వరద నీటిలోనే తిరుగుతూ ప్రజలకు ఆహారం, కూరగాయలు, పండ్లు సరఫరా చేస్తున్నారు. ఇక ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఒకపక్క ముంపు ప్రాంతాలలో పర్యటనలు చేస్తూ, మరో పక్క కేంద్రంతో సంప్రదింవులు జరువుదూ కేంద్ర సాయం జాప్యం లేకుండా వచ్చేలా చేస్తున్నారు.

దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో దుర్గ గుడి కిచెన్ లో లక్షల ఆహార పొట్లాలు తయారవుతున్నాయి. వండిన ఆహారం అయితే త్వరగా చెడిపోతుందని మార్కెటింగ్, వ్యవసాయ శాఖల ద్వారా లక్షల సంఖ్యలో యాపిల్స్ సేకరించారు. ఇక కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రాంమనోహర్ నాయుడు మొదటి రెండు రోజులు కంట్రోల్ రూమ్లో ఉండి వరద ముంపు ప్రాంతాల్లో అధికారులకు తగు సూచనలు చేస్తూ వచ్చారు. అదే సమయంలో చంద్రబాబు సూచనల మేరకు డ్రోన్ల ద్వారా బాధితులకు ఆహార పదార్థాలు అందించే విషయంలో సత్వర అనుమతులు వచ్చేలా చేశారు. మరో కేంద్ర మంత్రి తన నియోజకవర్గంలో వరద ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు అండగా నిలబడ్డారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగాఉన్న తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు ముంపు ప్రాంతాల్లో బాధితులకు ఆహారం, కూరగాయలు, పండ్లు సరఫరా చేయడంలో నిమగ్నమయ్యారు.



మంత్రులంతా వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉంటే.. రాష్ట్రంలో సాధారణ పాలన పరిస్థితి ఏమిట? అన్న అనుమానాలే ఎవరికీ కలగకుండా పాలన సాగింది. ఒక వైపు మంత్రులంతా వరద ముంపు ప్రాంతాలలో సహాయ పునరావాస కార్యక్రమాలలో నిమగ్నమై ఉన్న సమయంలో.. వరద ముంపులో ఉన్న విజయవాడలోనే వేదాంత కంపెనీ 83వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముంచుకొచ్చింది. ఈ కార్యక్రమానికి పెట్టుబడుల శాఖ మంత్రి హాజరయ్యారు. మరో మంత్రి ఢిల్లీలో మంత్రుల సదస్సులో ఉన్నాడు. రోజువారీ ప్రభుత్వలో జరగాల్సిన పనులన్నీ జరుగుతూనే ఉన్నాయి. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఏపీలో ప్రస్తుతం జరుగుతున్న పాలనను చూసి దేశం మొత్తం ఆశ్చర్యపోతుంది. ఇదీ ప్రభుత్వాన్ని నడిపించడం అంటే.. ఇదీ ప్రజల విషయంలో బాధ్యతగా ఉండడం అంటే.. ఇదీ ప్రజలకోసం పని చేయడం అంటే.. అంటూ దేశవ్యాప్తంగా ప్రముఖుల నుంచి, రాష్ట్ర ప్రజల నుంచి చంద్రబాబు, ఆయన టీంపై ప్రశంసల జల్లు కురుస్తోంది.

# భారత్-అమెరికా బంధం బలోపేతానికి కృషి:రాహుల్



డల్లాస్: భారత్-అమెరికా సంబంధాల బలోపేతానికి కృషి చేస్తానని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఆయన అమెరికా పర్యటన ఆదివారం మొదలైంది. దీనిపై ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్లో స్పందిస్తూ.." ప్రవాస భారతీయులు, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ సభ్యుల నుంచి డల్లాస్లో లభించిన ఆత్మీయ స్వాగతానికి సంతోషిస్తున్నాను. అర్థవంతమైన చర్చల్లో పాల్గొనడానికి ఆత్రుతతో ఎదురు చూస్తున్నాను. ఇరు దేశాల సంబంధాలను బలోపేతం చేయడానికి ఈ పర్యటనలో కృషి చేస్తాను" అని పేర్కొన్నారు. 2024 లోక్ సభ సార్వత్రిక ఎన్నికల తర్వాత ఆయన అమెరికా పర్యటన చేపట్టడం ఇదే తొలిసారి. సెప్టెంబర్ 8వ తేదీన డల్లాస్లో, 9-10 తేదీల్లో వాషింగ్టన్ డీసీలో పర్యటన జరగనుంది. ఈ సారి పర్యటనలో విద్యావేత్తలు, జర్నలిస్టులు, థింక్ ట్యాంక్ ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు, వ్యాపార వేత్తలతో భేటీ కానున్నారు. ఇక యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ లో ఆయన విద్యార్థులు, విద్యావేత్తలను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం ఉంది. ఈ పర్యటనపై గతంలో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా మాట్లాడుతూ.. రాహుల్ పర్యటన అధికారికంగా కాదని.. వ్యక్తిగత హోదాలో చేపట్టిందని వెల్లడించారు. ఆయన క్యాపిటల్ హిల్స్ లో పలువురు వ్యక్తులను కలుసుకొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాహుల్ ప్రతిపక్ష నేతగా ఎన్నికైన నాటి నుంచి రాహుల్ గాంధీని ఆహ్వానిస్తూ.. పలు దేశాల దౌత్యవేత్తలు, ప్రవాస భారతీయుల నుంచి విజ్ఞప్తులు వెల్లువెత్తాయని పిట్రోడా పేర్కొన్నారు. తాజా పర్యటనలో రాహుల్ గాంధీ నేషనల్ ప్రెస్క్లబ్లో నిర్వహించే విలేకర్ల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

# భారత్‌లో చేరండి

● పీవోకే ప్రజలకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపు ● జమ్మూకశ్మీర్‌లో జోరుగా అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ● రామ్‌బన్ నియోజకవర్గంలో కేంద్ర మంత్రి ప్రచారం ● పాక్ మాదిరి కాదు.. సొంత మనుషుల్లా చూసుకుంటాం: రాజ్‌నాథ్ సింగ్



శ్రీనగర్: జమ్మూకశ్మీర్లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. రాంబన్ నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన భాజపా ప్రచారంలో కేంద్ర మంత్రి రాజ్నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ విషయంలో కీలక వ్యాఖ్యలు చేశారు. పీవోకేవాసులు భారత్లో కలిసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పాకిస్థాన్ మాదిరి తాము వారిని విదేశీయుల్లా కాకుండా సొంత మనుషుల్లా పరిగణిస్తున్నామని తెలిపారు. "జమ్మూకశ్మీర్లో భాజపాకు మద్దతు ఇస్తే.. స్థానికంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం. మాకు పాకిస్థాన్తో కలిసి ఉండటం ఇష్టం లేదు.. భారత్కు వెళ్తామని పీవోకేలోని ప్రజలూ చెప్పేంత అభివృద్ధి చేస్తాం. పీవోకేను పాక్ ఓ విదేశీ భూభాగంగా పరిగణిస్తోంది. దాయాది దేశంలోని అదనపు సొలిసిటర్ జనరల్ కూడా ఇదే విషయాన్ని ఇటీవల ఓ అఫిడవిట్లో పేర్కొన్నారు. అక్కడి ప్రజలను పాకిస్థాన్ విదేశీయులుగా చూస్తోంది. కానీ, భారత్ అలా కాదు. సొంత మనుషుల్లా భావిస్తోంది. మాతో వచ్చి చేరండి" అని రాజ్నాథ్ సింగ్ ప్రసంగించారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్- నేషనల్ కాన్ఫరెన్స్ పొత్తుపై కేంద్ర మంత్రి విరుచుకుపడ్డారు. భాజపా ఉన్నంతవరకు జమ్మూకశ్మీర్లో ఆర్టికల్ 370 పునరుద్ధరణ అసాధ్యమని స్పష్టం చేశారు. ఆర్టికల్ 370ను రద్దు చేసిన తర్వాత జమ్మూకశ్మీర్ భద్రత పరిస్థితిలో మంచి మార్పు వచ్చిందని తెలిపారు. ఇదిలా ఉండగా.. జమ్మూకశ్మీర్లోని 90 అసెంబ్లీ స్థానాలకు మూడు దశల్లో (సెప్టెంబరు 18, 25, అక్టోబరు 1) పోలింగ్ నిర్వహించనున్నారు. 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# భారత్‌లో మంకీపాక్స్

● అనుమానాస్పద కేసు నమోదు



ఢిల్లీ: ప్రాణాంతక మంకీపాక్స్ వ్యాప్తి పలు దేశాలను కలవరపెడుతోన్న వేళ భారత్లోనూ ఈ కేసు నమోదైంది. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న దేశం నుంచి వచ్చిన ఓ యువకుడిలో ఎంపాక్స్ లక్షణాలు గుర్తించినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. వెంటనే అతడిని ఐసోలేషన్లో ఉంచామని, ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు తెలిపింది. రోగి నుంచి నమూనా సేకరించి ఎంపాక్స్ నిర్ధరణ కోసం పంపించామని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని, ఇదే సమయంలో వ్యాధి సంక్రమణ మూలాలను గుర్తించేందుకు కాంటాక్ట్ ట్రేసింగ్ కొనసాగుతోందని పేర్కొంది. ఈ వ్యాధి తీవ్రతపై జాతీయ వ్యాధుల నియంత్రణ కేంద్రం ముందస్తుగానే అంచనాలు వేసిందని.. ఆందోళన చెందాల్సి అవసరం లేదని చెప్పింది. ఇటువంటి కేసులు వెలుగు చూసిన సందర్భంలో వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు పూర్తి సంసిద్ధతతో ఉన్నట్లు పేర్కొంది. మరోవైపు ప్రాణాంతక ఎంపాక్స్ వ్యాప్తి ఆఫ్రికా దేశాల్లో ఆందోళనకర రీతిలో ఉన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే 18వేల అనుమానిత కేసులు, 926 మరణాలు సంభవించాయి. కొత్తరకం కేసులు ఇప్పటివరకు 258 నమోదైనట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. ఆఫ్రికాలోని బురుండి, రువాండా, కెన్యా, ఉగాండాతోపాటు స్వీడన్, థాయ్లాండ్ దేశాల్లోనూ ఈ కేసులు వెలుగు చూశాయి. భారత్లోనూ ఈ ఏడాది మార్చి తర్వాత ఈ కేసులు నమోదు కాలేదు.

# డీకేకు కమలా హారిస్ ఆహ్వానం

● న్యూయార్క్‌లో కమలతో వ్యక్తిగతంగా చర్చించనున్నట్లు సమాచారం ● ఒబామాతో కూడా మీటింగ్‌కు ప్లాన్ ● రాహుల్ గాంధీ పర్యటన సమయంలోనే అమెరికాకు డీకే ● బయటకురాని సమావేశాల అజెండా



బెంగళూరు: అమెరికా అధ్యక్ష ఎన్నికల ముందు కీలక పరిణామం చోటు చేసుకుంది. కర్ణాటక ఉపముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత డీకే శివకుమార్కి డెమొక్రాటిక్ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ నుంచి ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది. ఈ రోజు రాత్రి ఆయన అమెరికా వెళ్లనున్నట్లు అక్కడ కమలా హారిస్తో భేటీ కానున్నట్లు వినికిడి. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాతో కూడా భేటీ కానున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశాల ఖచ్చితమైన ఎజెండా ఏమిటో తెలియనప్పటికీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అమెరికాలో ఉన్న సమయంలోనే శివకుమార్ కూడా అక్కడికి వెళ్తుండటం గమనార్హం. న్యూయార్క్లో ఆయన కమలా హారిస్తో వ్యక్తిగతంగా చర్చించనున్నట్లు తెలుస్తోంది. బరాక్ ఒబామాతో కూడా వన్ వన్ మీటింగ్ ప్లాన్ చేస్తున్నారు. శివకుమార్కి కమలా హారిస్తో పాటు డెమొక్రాటిక్ నేతల నుంచి ఆహ్వానం అందినట్లు సమాచారం. కమలా హారిస్ కొన్ని నెలల నుంచి డీకే శివకుమార్తో సంప్రదింపులు జరుగుతున్నారనే ఆసక్తికరమైన వార్త వినిపిస్తోంది. మరోవైపు సెప్టెబర్ 10న రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, వచ్చే ఎన్నికల్లో ప్రెసిడెన్షియల్ అభ్యర్థి, ప్రస్తుత వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్ మధ్య డిబేట్ జరగబోతోంది. మరోవైపు రెండు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం రాత్రి అమెరికా పర్యటనకు బయలుదేరారు. ఈ పర్యటనలో రాహుల్ గాంధీ ప్రవాస భారతీయులతో, విద్యా, వ్యాపారవేత్తలో సమావేశం కానున్నారు.

### ఈయన అక్కడకు వెళ్లి టీ తాగడం వల్ల..

# పాక్ జాతి మొత్తం మూల్యం చెల్లిస్తోంది



కరాచీ: అఫ్గానిస్థాన్లో తాలిబన్ల రాజ్యం ఏర్పడ గానే అక్కడికి వెళ్లి టీ తాగిన పాక్ ఆర్మీకి చెందిన ఓ జనరల్ చేసిన తప్పునకు ఇప్పుడు దేశం మొత్తం మూల్యం చెల్లింస్తోందట. ఈ విషయాన్ని పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇసాక్ దార్ శనివారం లండన్ హైకమిషన్ కార్యాలయంలో వెల్లడించారు. అమెరికా మద్దతుతో ఉన్న ఘని ప్రభుత్వాన్ని కూల్చేందుకు తాలిబన్లకు మద్దతుగా కొందరు మిలిటెంట్లను విడుదల చేశారన్నారు. వారే ఇప్పుడు బలోచిస్థాన్లో ఉగ్రవాదానికి మాస్టర్మైండ్లుగా మారారని ఆందోళన వ్యక్తం చేశారు. "ఆ కప్పు టీకి దేశం మొత్తం మూల్యం చెల్లిస్తోంది" అని డాన్పత్రిక రాసిన వ్యాసాన్ని ఉటంకించారు. గత కొన్ని రోజుల్లో జరిగిన దాడుల్లో పాక్లోని వివిధ ప్రావిన్స్లో మొత్తం 14 మంది సైనికులు సహా 50 మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో దార్ ఈ వ్యాఖ్యలు చేశారు. హమీద్ కాబూల్ పర్యటనకు నాటి ప్రధాని అనుమతి ఇచ్చారా అన్న ప్రశ్నపై స్పందిస్తూ.. "ఇమ్రాన్ ఖాన్ అనుమతి లేకుండా ఆయన అక్కడకు వెళ్లారని నమ్మడం చాలా కష్టం. ప్రధాని అనుమతి లేకుండా ఇలాంటివి జరగవు. సెక్యూరిటీ విభాగాలతో కలిసి మేం ఈ అంశంపై పనిచేయాలి" అని పేర్కొన్నారు. 2021లో పాక్ ఐఎస్ఐ చీఫ్ ఫయాజ్ హమీద్ కాబూల్ సందర్శించారు. ఆ సందర్భంగా తాలిబన్ల ఆతిథ్యం స్వీకరిస్తూ ఓ టీకప్పుతో దిగిన ఫొటో సంచలనంగా మారింది. తాజాగా అతడిని విమర్శిస్తూ దార్ వ్యాఖ్యలు చేశారు. ఓ కేసులో ఇటీవలే పాక్ సైన్యం ఫయాజ్ హమీద్ను అరెస్టు చేసింది. ప్రస్తుతం ఆయనపై కోర్టు మార్షల్ జరుగుతోంది. బలోచిస్థాన్ వేర్పాటువాదం పాకిస్థాన్లో తార స్థాయికి చేరింది. గత మూడేళ్లలో తెహ్రీక్ ఈ తాలిబన్, బలోచ్ మిలిటెంట్ సంస్థలు తీవ్ర స్థాయిలో దాడులు నిర్వహిస్తున్నాయి. వీటి దెబ్బకు దాదాపు 60 బిలియన్ డాలర్ల వ్యయంతో నిర్మించిన చైనా-పాక్ ఎకనామిక్ కారిడార్ ప్రాజెక్టు భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడింది.

# దళపతి విజయ్ పార్టీకి అధికారిక గుర్తింపు

● ఫిబ్రవరి 2న టీవీకే పార్టీ ప్రకటన ● ఆగస్టు 22న పార్టీ జెండా, గుర్తు ఆవిష్కరణ ● తమిళనాడు సంక్షేమం కోసమే పార్టీ ఏర్పాటు చేశామన్న విజయ్ ● 2026లో జరిగే ఎన్నికల్లో బరిలోకి దిగేందుకు సన్నాహాలు

చెన్నై: ప్రముఖ తమిళ కథానాయకుడు, దళపతి విజయ్ స్థాపించిన పార్టీ 'తమిళగ వెట్రి కళగం'కు ఎన్నికల కమిషన్ నుంచి అధికారిక గుర్తింపు లభించింది. పోల్ ప్యానెల్కు చేసిన అభ్యర్థనకు ఏడు నెలల తర్వాత ఆమోదం లభించింది. గత నెల చెన్నై శివారు పనైయూర్లోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో విజయ్ జెండాను ఆవిష్కరించారు. జెండాలో పైన, కింది భాగంలో ఎరుపు, మధ్యలో పసుపు రంగులు ఉన్నాయి. మధ్యలో ఎరుపురంగు వృత్తాకారం లోపల శిరీష పుష్పం, చుట్టూ 28 నక్షత్రాలు ఉన్నాయి. వాటిలో ఐదు నీలం, మిగతావి పచ్చ రంగులో ఉన్నాయి. శిరీష పుష్పానికి రెండు వైపులా ఘీంకరించే ఏనుగు రూపాలు ఉన్నాయి. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. పార్టీ రిజిస్టర్ నిమిత్తం ఫిబ్రవరి 2న ఈసీని సంప్రదించగా తాజాగా పర్మిషన్ ఇచ్చినట్టు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్లో పోస్ట్ చేశారు. 'దేశ ఎన్నికల సంఘం టీవీకేని చట్ట బద్ధంగా పరిగణించింది. దీంతో టీవీకే రాజకీయ పార్టీగా అవతరించింది. ఈ విషయాన్ని ప్రజలతో పంచుకోవడం చాలా సంతోషంగా ఉంది' అని తెలిపారు. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర సదస్సుకు సన్నాహాలు ప్రారంభించామని, దీనికి సంబంధించి త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని చెప్పారు. పార్టీ సిద్ధాంతాలను త్వరలోనే ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. 'ఇప్పటివరకు మన కోసం మనం శ్రమించాం.. ఇకపై తమిళనాడు, తమిళుల ఉన్నతి కోసం సమష్టిగా శ్రమిద్దాం' అని పిలుపునిచ్చారు. 2026లో జరిగే రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో బరిలోకి దిగుతామని విజయ్ వెల్లడించారు. తమిళనాడు రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరిగే ఎన్నికలే లక్ష్యంగా టీవీకే పని చేయనున్నట్టు తెలుస్తోంది. గతంలోనూ విజయ్ ఈ విషయాన్ని పలు మార్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే పార్టీ ప్రణాళికలను రూపొందించనున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని ప్రజల్లోకి తీసుకుపోయేందుకు కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉంది. అయితే లోక్సభ ఎన్నికలకు ముందే టీవీకే ప్రకటించినప్పటికీ, ఆ పార్టీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. అంతేగాక ఎవరికీ మద్దతు ప్రకటించలేదు. హీరో



విజయ్ ఫిబ్రవరి 2న టీవీకే పార్టీని ప్రకటించారు. ఆగస్టు 22న తన పార్టీకి జెండాను, గుర్తును ఆవిష్కరించారు. అనంతరం పనైయూర్ పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేసి, రాజకీయ పార్టీకి సంబంధించిన అధికారిక పాటను కూడా విడుదల చేశారు. తమిళనాడు సంక్షేమం కోసమే పార్టీ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

# బెంగాల్‌లో మమతకు షాక్

● రాజ్యసభ పదవినే వదిలేసిన జవహర్ సిర్కార్ ● రాజీనామాతోపాటు దీదీకి ఘాటు లేఖ ● అవినీతి పరులు ఉన్నత పదవుల్లో ఉన్నారు ● ప్రజలు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారు: జవహర్



కోల్‌కతా : ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రైయినీ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ హత్యాచార ఘటనతోపాటు అనంతరం చోటు చేసుకున్న పరిణామాలపై మమతా బెనర్జీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు పట్ల సర్వత్రా ఆరోపణలు అయితే వెల్లువెత్తాయి. అలాంటి వేళ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నేత జవహర్ సిర్కార్.. తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీకి ఆదివారం ఆయన లేఖ రాశారు. ట్రైయినీ వైద్యురాలి హత్యాచార ఘటన అనంతరం రాష్ట్రంలో ఆందోళనలను అరికట్టడంలో పార్టీ ఘోర వైఫల్యం చెందిందన్నారు. పార్టీలో చోటు చేసుకున్న అవినీతిపై సీఎం మమతా బెనర్జీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. సీఎం మమతా బెనర్జీతో భేటీ అయి మాట్లాడేందుకు తనకు గత కొన్ని నెలలుగా ప్రయత్నిస్తున్నా.. అవకాశమే ఇవ్వడం లేదని జవహర్ సిర్కార్ పేర్కొన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో అవినీతికి పాల్పడిన పలువురు ఉన్నతాధికారులు కీలక పదవుల్లో కొనసాగుతున్నారన్నారు. వైద్యురాలిపై హత్యాచారం అనంతరం రాష్ట్రంలో జరిగిన ఆందోళనలతో.. ఈ ప్రభుత్వం వెనుక ప్రజలు లేరనే విషయం స్పష్టమైందని చెప్పారు. ఈ హత్యాచార ఘటన కారణంగా జూనియర్ డాక్టర్లు ఆందోళన చేపట్టారని.. ఈ నేపథ్యంలో గతంలో వలే ముఖ్యమంత్రి కఠిన చర్యలు తీసుకుంటారని తాను భావించానన్నారు. అందుకోసం ఈ ఘటన జరిగిన నాటి నుంచి తాను వేచి చూసినట్లు తెలిపారు. అలాంటి చర్యలు ఏమీ ఆమె తీసుకోలేదన్నారు. ఈ హత్యాచార ఘటన అనంతరం ప్రభుత్వం చేపట్టిన చర్యలు తీవ్ర ఆక్షేపణీయంగా ఉన్నాయని విమర్శించారు. అలాగే పార్టీలో, ప్రభుత్వంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను చక్కదిద్దాలని ఈ సందర్భంగా పార్టీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీకి ఆయన సూచించారు. అలా కాకుంటే రాష్ట్రం మతోన్మాద శక్తుల చేతుల్లోకి వెళ్లి పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఎంపీగా ఉన్న ఈ మూడేళ్లలో... పెద్దల సభలో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను లేవనెత్తిన విషయాన్ని ఈ సందర్భంగా జవహర్ సిర్కార్ గుర్తు చేశారు. తన పోరాటమంతా అవినీతితోపాటు మతతత్వంపైనేనని ఈ సందర్భంగా జవహర్ స్పష్టం చేశారు.

# చైనాలో కొత్త రకం వైరస్

● జంతువుల్లో రక్తం పీల్చే పురుగుల నుంచి మనుషులకు వ్యాపించే వైరస్ ● 20 మంది బాధితులకు పాజిటివ్ రావడంతో వైరస్ నిర్ధారణ ● నరాల సంబంధిత వ్యాధులకు కారణమవుతున్నట్లు గుర్తించిన పరిశోధకులు ● ప్రమాదకర ఇన్ ఫెక్షన్‌కు కారణమవుతున్నట్లు ప్రయోగాల్లో నిర్ధారణ

బీజింగ్: చైనాలో కొత్త రకం వైరస్ వెలుగు చూసింది. జంతువుల్లో రక్తం పీల్చే పురుగుల నుంచి మనుషులకు వ్యాపించే వెట్ల్యాండ్ వైరస్ ను పరిశోధకులు గుర్తించారు. ఇది కొన్నిసార్లు నరాల సంబంధిత వ్యాధులకు కారణమవుతున్నట్లు కనుగొన్నారు. చైనాలోని జిన్జువో నగరంలో 61ఏళ్ల వృద్ధుడిలో 2019లోనే తొలుత ఈ వైరస్ను గుర్తించారు. మంగోలియాలోని చిత్తడి నేలకు చెందిన ఇతడికి పరాన్నజీవి కుట్టడంతో అనారోగ్యానికి గురయ్యాడు. ఐదు రోజులపాటు జ్వరం, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపించాయి. వెంటనే అప్రమత్తమైన పరిశోధకులు.. సమీప ప్రాంతాల్లో దాదాపు 14,600 జీవులను సేకరించి అధ్యయనం చేశారు. రెండుశాతం పరాన్నజీవుల్లో డబ్ల్యూఎల్వీ జన్యు పదార్థం ఉన్నట్లు గుర్తించారు. అంతేకాకుండా ఆ ప్రాంతంలో 640 మంది అటవీ అధికారుల రక్త నమూనాలను సేకరించి విశ్లేషించగా.. 12 మందిలో ఈ రకమైన వైరస్ ఉన్నట్లు తేలింది. ఇలా పలు రకాల పురుగుల కాటుకు గురైన 20 మంది బాధితులకు పాజిటివ్ రావడంతో వైరస్ను నిర్ధరించినట్లు పరిశోధకులు వెల్లడించారు. చికిత్స తర్వాత రోగులందరూ కోలుకున్నప్పటికీ ఈ వైరస్ వల్ల నాడీకణ వ్యవస్థపై



ప్రభావం చూపడంతోపాటు ప్రమాదకర ఇన్ఫెక్షన్లకు కారణమవుతున్నట్లు ఎలుకల్లో జరిపిన ప్రయోగాల్లో తేలినట్లు చెప్పారు. ఈ వెట్ల్యాండ్ వైరస్ కూడా మానవుల్లో తీవ్ర అనారోగ్యానికి కారణమయ్యే క్రిమియన్-కాంగో హెమరేజిక్ ఫీవర్ గ్రూపునకు చెందినది. కొన్ని రకాల పరాన్నజీవుల వల్ల ఇది వ్యాపిస్తుంది. కొన్ని గుర్రాలు, పందులు, గొర్రెల్లోనూ ఈడబ్ల్యూఎల్వీ ఆర్ఎన్ఏను ఇదివరకే గుర్తించారు. జంతువుల్లోని రక్తనాళాల్లో నిర్మాణాత్మక మార్పులు కలిగించిప్రాణాంతక ఇన్ఫెక్షన్లకు కారణమవుతున్నట్లు పరిశోధకులు కనుగొన్నారు. తాజా అధ్యయనానికి సంబంధించిన నివేదిక ది న్యూ ఇంగ్లాడ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్లో ప్రచురితమైంది.

# హసీనా అరెస్టుకు బంగ్లాదేశ్ సన్నాహాలు

● వారెంట్ జారీకి అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్‌కు దరఖాస్తు



ఢాకా: బంగ్లాదేశ్లో ఇటీవల రిజర్వేషన్ల వ్యతిరేక నిరసనల్లో పెద్దఎత్తున హింస చెలరేగిన విషయం తెలిసిందే. వందల మంది మృతి చెందారు. ఈ క్రమంలోనే మాజీ ప్రధాని షేక్ హసీనా తదితరులపై హత్య కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం హసీనా భారత్లో ఆశ్ర యం పొందుతు న్నారు. అయితే సామూహిక హత్యల ఆరోపణ లపై విచారిం చేందుకు గానూ ఆమెను స్వదేశానికి రప్పించేం దుకు అవసం`మైన అన్ని చర్యలు తీసుకుంటామని బంగ్లాదేశ్ 'ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ (ఐసీటీ)' నూతన చీఫ్ ప్రాసిక్యూటర్ ఎండీ తాజుల్ ఇస్లాం తెలిపారు. సామూహిక హత్యలు, ఇతర నేరాలకు సంబంధించి షేక్ హసీనా సహా పరారీలో ఉన్న నిందితులందరిపై అరెస్టు వారెంట్లు జారీ చేసేందుకు ఐసీటీకి దరఖాస్తు చేస్తామని ఢాకాలో నిర్వహించిన మీడియా సమావేశంలో తాజుల్ ఇస్లాం తెలిపారు. 'నిందితుల అప్పగింత ఒప్పందం' కింద హసీనాను భారత్ నుంచి బంగ్లాదేశ్కు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. హసీనా, మరో తొమ్మిది మందిపై ఐసీటీ గత నెలలో దర్యాప్తు ప్రారంభించింది. ప్రస్తుతం ఐసీటీని పునర్వ్య వస్థీకరిస్తున్నారు.

# అవినీతి పరులందరినీ జైలుకు పంపిస్తా



వాషింగ్టన్: అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వైరల్గా మారింది. ఎన్నికల సమయంలో అవినీతికి పాల్పడే వారిని ఉద్దేశిస్తూ ఈ పోస్టు చేశారు. తాను అధికార పీఠమెక్కాక అవినీతిపరులందరిని జైలుకు పంపిస్తానని హెచ్చరించారు. తమ ప్రభుత్వం వారికి కఠిన శిక్ష అమలు చేస్తుందని పేర్కొన్నారు. "దయచేసి జాగ్రత్త వహించండి. అధ్యక్ష ఎన్నికల్లో నేను గెలిస్తే.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, ఓటింగ్లో అనైతిక చర్యలకు పాల్పడిన వారిని వదిలే ప్రసక్తే లేదు. న్యాయవాదులు, రాజకీయ నాయకులు, దాతలు, అక్రమ ఓటర్లు, అధికారులు అందరికీ అదే వర్తిస్తుంది. పూర్తి స్థాయిలో విచారణ జరుగుతుంది. ఓటింగ్లో అవినీతికి పాల్పడినట్లు తేలితే.. మునుపెన్నడూ చూడని విధంగా చర్యలు ఉంటాయి. దీర్ఘకాల జైలు శిక్షలు ఉంటాయి. తద్వారా న్యాయ దుర్వినియోగం మళ్లీ జరగదు" అని ట్రంప్ హెచ్చరించారు. గత అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓటమిని చవి చూశారు. నాడు ఎన్నికల వేళ అవినీతి జరిగిందంటూ ఆయన ఆరోపించారు. కానీ, దాన్ని రుజువు చేసేందుకు సరైన ఆధారాలు లేకపోవడంతో అవి ఆరోపణలుగా మిగిలిపోయాయి. దీంతో ఓటింగ్ వేళ మరోసారి అవినీతి జరగకుండా ఉండాలనే ఆయన ఈ పోస్టు పెట్టినట్లు తెలుస్తోంది. అవినీతి జరిగితే.. అధికారం చేపట్టగానే వారిపై చర్యలు తీసుకుంటానని పరోక్షంగా హెచ్చరిస్తున్నారు. త్వరలో అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. రేసు నుంచి అధ్యక్షుడు జో బైడెన్ తప్పుకోగా.. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ప్రచారంలో దూసుకెళుతున్నారు. మరోవైపు ట్రంప్ అధికారం చేజిక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. అధ్యక్ష అభ్యర్థులుగా ఖరారైన ట్రంప్, కమలా హారిస్ త్వరలోనే ముఖాముఖిగా ఎదురుపడనున్నారు. ఈ నెలలోనే వీరిద్దరూ తొలి డిబేట్లో పాల్గొననున్నారు. ఈ డిబేట్పై యావత్ దేశం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

# కర్ణాటక సీఎం కుర్చీపై సీనియర్ల కన్ను?

● సీఎం సిద్దుకు బిగుసుకుంటున్న ముడా స్కామ్ ఉచ్చు ● సిద్ధరామయ్య తర్వాత నేనే సీనియర్ అంటూ నేతల మధ్య వార్ ● బయటకు పాక్కిన ఇద్దరు సీనియర్ మంత్రుల మాటల యుద్ధం ● కాంగ్రెస్ అంతర్గత కలహాలను ఎత్తిచూపుతున్న బీజేపీ

బెంగళూరు: స్థలం కేటాయింపు కేసులో గవర్నర్ అనుమతిని సవాల్ చేస్తూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దాఖలు చేసిన పిటిషన్పై హైకోర్టులో విచారణ జరుగుతోంది. కాగా ఇదే అదునుగా భావించి కొందరు కాంగ్రెస్ నేతలు సీఎం కుర్చీపై ఆశ పడుతున్నట్లుగా తెలుస్తోంది. సిద్ధరామయ్య తర్వాత సీఎం అయ్యే సీనియారిటీ, అవకాశం ఎవరికి ఎక్కువగా ఉందనే విషయంలో ఇద్దరు సీనియర్ మంత్రులు ఎం బి పాటిల్, శివానంద్ పాటిల్ మధ్య మాటల యుద్ధం జరిగినట్లుగా సమాచారం. ఇటీవల మీడియా సమావేశంలో ఎం.బి పాటిల్ మాట్లాడుతూ "ముఖ్యమంత్రి కావడంలో సీనియారిటీ ప్రధానం కాదు.. పార్టీలో నాకంటే సీనియర్లు ఉన్నారు. అయినా ఇప్పుడు ముఖ్యమంత్రిని మార్చే ప్రశ్నే లేదు. సిద్ధరామయ్యే సీఎంగా కొనసాగుతారు. ఇప్పుడు ఆ విషయాల గురించి మాట్లాడటం అప్రస్తుతం" అని అన్నారు. తనకు సీఎం కావాలనే కోరిక లేదని శివానంద్ పాటిల్ గతంలో పేర్కొన్నారు. సీఎం అభ్యర్థిగా ఎంబీ పాటిల్ ఉంటే మద్దతు ఇస్తారా అని మీడియా శివానంద్ను ప్రశ్నించడంతో పార్టీలో ఆయన కంటే సీనియర్లు చాలామంది ఉన్నారని, ఎంబీ మరికొంత కాలం వేచి ఉండాల్సి ఉంటోందని అన్నారు. కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే, పరిపాలనా సంస్కరణల కమిషన్ ఛైర్పర్సన్ ఆర్వీ దేశ్పాండే సీఎం కావాలనే తన కోరికను ఇటీవలే వ్యక్తం చేశారు. ఆయన వ్యాఖ్యలపై సిద్ధరామయ్య స్పందిస్తూ ఎవరు సీఎం అవుతారో శాసనసభ్యులు, హైకమాండ్ నిర్ణయిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న అంతర్గత కలహాలను బీజేపీ ఎత్తి చూపుతోంది. సీఎం స్థానం దక్కించుకోవడానికి కాంగ్రెస్లో అంతర్గత పోరు మొదలైందని, రాబోయే రోజుల్లో అది మరింత ముదురుతుందని పేర్కొంది. కానీ, పైకి మాత్రం సిద్ధరామయ్య వెంటే తాము ఉన్నామంటూ పార్టీ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని భాజపా ఎంపీ జగదీశ్ శెట్టర్ మండిపడ్డారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా సీఎం పదవి కోసం అంతర్గత ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇంతకీ ఏం జరిగిందంటే: మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) స్థలాల పంపిణీలో అక్రమాలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలపై విచారణకు హాజరు కావాలంటూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఆ రాష్ట్ర గవర్నర్ థావర్



చంద్ గహ్లోత్ తాఖీదులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య పార్వతమ్మకు వారసత్వంగా వచ్చిన భూములను 'ముడా' స్వాధీనం చేసుకుని మరొక చోట స్థలాలు మంజూరు చేసింది. స్వాధీనం చేసుకున్న భూముల కంటే మంజూరు చేసిన స్థలాల విలువ ఎక్కువగా ఉందనేది ఆరోపణ. ఈ వ్యవహారంలో సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ ఓ ఆర్టీఐ కార్యకర్త జూన్ 26న గవర్నర్ థావర్చంద్ గహ్లోత్కు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ఆ రాష్ట్ర సీఎస్ ఈ ఫిర్యాదుకు వివరణ ఇస్తూ గవర్నర్కు నివేదిక ఇచ్చారు. దాని ఆధారంగా ఆయన సీఎంకు తాఖీదులు ఇచ్చారు. వీటిని సవాల్ చేస్తూ సీఎం సిద్ధరామయ్య హైకోర్టును ఆశ్రయించారు.



# ప్రభుత్వం ప్రజా వైద్యం పై దృష్టి సారించాలి

**తెలంగాణ బ్యూరో్ప్రతినిధిః** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వైద్యం పై దృష్టి సారించాలని తెలంగాణ ఆరె కటిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కళ్యాన్‌కర్ ఈశ్వర్ చౌదరి డిమాండ్ చేశారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. పేదలకు ఖరీదైన మందులు పేదలకు అందడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో ఒక వెలుగు వెలిగిన గాంధీ ఆసుపత్రి, ఉస్మానియా ఆసుపత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యం అందడం లేదు. ఒక వైపు సీజనల్ వ్యాధులు విస్తరిస్తుండగా మరో వైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు లభించక రోగులు లబోదిబో మంటున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్లలో కూడా మందుల కొరత తీవ్రంగా ఉంది. బీపీ, షుగర్ మందులతో పాటు బొటాక్స్(బీవోటీవోఎక్స్) అనే ఇంజక్షన్ లభించడంలేదని ఆయన ఆరోపించారు.. ఈ ఇంజక్షన్ ఖరీదు రూ.30వేల నుంచి రూ.60 వేల వరకు వివిధ డోసుల్లో లభిస్తుంది. ప్రభుత్వ ఉపాధ్యాయులు, జర్నలిస్టులు, కార్మికులకు వెల్‌నెస్ సెంటర్లలో మెరుగైన వైద్యం అందించేలా గత కేసీఆర్ ప్రభుత్వ చర్యలు చేపట్టింది. అలాగే ప్రజలకు వైద్యాన్ని మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసింది. ముఖ్యంగా హైదరాబాద్ మహానగరంలో గాంధీ, ఉస్మానియా, నిజాం ఇనిస్టిట్యూట్ మెడికల్ అండ్ సైన్స్, ఫీవర్(ఫీవర్) ఆసుపత్రులతో పాటు బస్తీ దవాఖానాలు, వెల్‌నెస్ సెంటర్లలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఆయా ఆసుపత్రులకు వెళ్తున్న రోగులను డాక్టర్లు పరీక్షించి వారికి మందుల చీటిని అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా ఆసుపత్రుల్లో డాక్టర్లు వ్రాసిన మందులు అందుబాటులో ఉండటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఖరైదైన మందులు అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఖరీదైన మందులకు పక్కదారి పట్టకుండా ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈశ్వర్ చౌదరి డిమాండ్ చేశారు.

# వరదలపై రాజకీయం సరికాదు

● విపత్కర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలి ● ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాలి ● తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం అడ్వాన్స్ డిజాస్టర్ ఫండ్ కింద రూ.1,300 కోట్లు పంపింది ●కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి



**తెలంగాణ బ్యూరో్ప్రతినిధిః** మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పర్యటించారు. ఖమ్మం నగరంలోని 16వ డివిజన్ దంసాలపురం, తిరుమలాయపాలెం, రాకాసి తండాలో వరదముంపు బాధితులతో కేంద్ర మంత్రి మాట్లాడారు. వీధుల్లో తిరుగుతూ అక్కడి పరిస్థితిని స్వయంగా తెలుసుకున్నారు. వరదల్లో కొట్టుకుపోయిన ఇళ్లను పరిశీలించి బాధితులను ఓదార్చారు. నిత్యావసరాల పంపిణీ, పునరావాస కార్యక్రమాలపై ఆరా తీశారు. కిషన్ రెడ్డితోపాటు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.."ప్రకృతి వైపరిత్యాలు వంటి విపత్కర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలి. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాలి. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం అడ్వాన్స్ డిజాస్టర్ ఫండ్ కింద రూ.1,300 కోట్లు పంపింది. వరదపై రాజకీయం చేయడం సరికాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మున్నేరు వరద బాధితులకు అండగా ఉంటాయి. వరదల్లో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ సాయం అందిస్తాం. వర్షాలకు సర్వం కోల్పోయిన వారిని చూస్తుంటే బాధేస్తోంది. రాజకీయాలకు అతీతంగా బాధితులను ఆదుకుందాం. రాష్ట్ర ప్రభుత్వం వరద బాధితుల కోసం సహాయక కార్యక్రమాలు వేగవంతం చేయాలి. తెలంగాణ ప్రభుత్వం నుంచి నివేదిక వచ్చిన తర్వాత కేంద్ర బృందాలు పర్యటించి పంట, పశు సంపద నష్టంపై అంచనాలు తయారు చేస్తారు. అనంతరం బాధితులకు వికాస్ మేనేజ్మెంట్ కింద సహాయం చేస్తాం" అని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితోపాటు తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఇలాంటి సమయాల్లో పార్టీలన్నీ ప్రజలకు సేవ చేసేందుకు కలిసి ముందుకు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ ప్రజలకు సేవ చేయడం పక్కనపెట్టి రాజకీయ విమర్శలు చేయడం సరికాదని శ్రీనివాస రెడ్డి అన్నారు. ఇళ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తాయని మంత్రి హామీ ఇచ్చారు. బ్యాంకులు తెరిచిన వెంటనే తక్షణ సాయం కింద మున్నేరు వరద బాధితుల అకౌంట్లో నగదు వేస్తామని మంత్రి శ్రీనివాస రెడ్డి చెప్పారు

# ముఖ్యమంత్రిసహాయనిధికి 2 నెలల జీతం విరాళం



**తెలంగాణ బ్యూరో్ప్రతినిధిః** ఎగిరిపోయిన పైకప్పులు, కూలిన గోడలు, కొట్టుకుపోయిన ఇళ్లు..! ఖమ్మంలో మున్నేరు విలయంతో ఎటుచూసినా విషాద గాథలే..! ఏ వీధిలో తిరగాలన్నా అంతా బురదే..! ఏ ఇంట్లో చూసినా మట్టికొట్టుకున్న వస్తువులు, దుస్తులే..! కొందరికి ఇవీ లేవు. ఆయా ప్రాంతాల్లో ఏ ఇల్లాలిని కదిలించినా కన్నీరే. మున్నేరు ఉగ్రరూపం దాల్చి 36 అడుగుల మేర ప్రవహించడంతో నది తీరాన ఉన్న ప్రాంతాల్లో వేల ఆవాసాలు నీట మునిగాయి. ఇలా ఒకటా రెండా ఎటు చూసినా హృదయాలను కదిలించే దృశ్యాలే!. ఇప్పుడిప్పుడే అటు మున్నేరు కాస్త శాంతించగా.. ఇటు ఖమ్మం నగర వాసులు కాస్త ఊపిరిపీల్చుకుంటున్నారు. అయితే.. వరద బాధితులను ఆదుకునేందుకు ఎంతోమంది సినీ, రాజకీయ ప్రముఖులు ముందుకొచ్చారు. సామాన్య ప్రజలు మొదలుకుని సెలబ్రిటీలు, పలు రంగాల పెద్దలు ముందుకొచ్చి తమకు తోచినంత విరాళంగా ప్రకటించారు. వారు ప్రకటించిన సొమ్ము అంతా చెక్కులు, నేరుగా నగదు, ఆన్‌లైన్ రూపంలో ఇప్పటికే సీఎం సీఎం సహాయ నిధికి అందజేశారు. ఇక 'మేము సైతం' అంటూ తెలంగాణాలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ముందుకొచ్చి కొండంత సాయం చేసింది. భారీ వర్షాలతో అతలాకుతలమైన ఖమ్మంను ఆదుకోవడానికి కాంగ్రెస్ కొండంత సాయం చేసింది. వరద బాధితుల విషయంలో కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. వరద బాధితుల కోసం రెండు నెలల జీతాన్ని ఇవ్వాలని ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు తమ రెండు నెలల జీతాన్ని సీఎం సహాయనిధికి ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలు కార్పోరేషన్ల చైర్మన్లు కూడా ఉన్నారు. వీరంతా తమ రెండు నెలల జీతాన్ని సీఎం సహాయ నిధికి విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించడం జరిగింది. వీరితో పాటు ప్రభుత్వ సలహాదారులు సైతం తమ రెండు నెలలు జీతం ముఖ్యమంత్రి సహాయనిధికి ఇవ్వాలని నిర్ణయించారు. కాంగ్రెస్ నేతలంతా.. సీఎం రేవంత్ రెడ్డి, కొత్త పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల నిర్ణయం పట్ల సామాన్య ప్రజలు, వరద బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక వరద బాధిత ప్రాంతాల్లో పరిస్థితులపై ఎప్పటికప్పుడు సీఎం రేవంత్ రెడ్డి సమీక్షలు నిర్వహిస్తూనే ఉన్నారు. మరోవైపు.. సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక సమీక్షలు, సమావేశాలు రద్దు చేసుకుని మరీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు వరద ప్రభావిత ప్రాంతాల్లోనే ఉంటున్నారు. ఇప్పటికే కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఖమ్మంలో పర్యటించగా.. ఆదివారం నాడు మరో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా పర్యటించారు.

# కేంద్ర సాయం కోసం తెలుగురాష్ట్ర ప్రభుత్వాల లేఖలు

● వరదల్లో 45 మంది చనిపోయారన్న ఏపీ సర్కారు ● మొత్తం 6.44 లక్షల మందిపై వరద ప్రభావం పడినట్టు వివరణ ● రూ.5,438 కోట్ల నష్టం వాటిల్లిందని తెలంగాణ సర్కారు ప్రాథమిక నివేదిక ● తక్షణ సాయంగా రూ.2 వేల కోట్లు మంజూరు చేయాలన్న రేవంత్ సర్కారు



**విజయవాడ- హైదరాబాద్ః** భారీ వర్షాలు, వరదల కారణంగా భారీ నష్టం సంభవించిన నేపథ్యంలో, కేంద్ర సాయం పొందేందుకు వీలుగా ఇరుతెలుగు రాష్ట్రాలు వరుస ప్రకటనలు చేసాయి. ప్రధానంగా తమ రాష్ట్రంలో 45 మంది చనిపోయారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతన ప్రకటనలో వెల్లడించింది. ఒక్క ఎన్టీఆర్ జిల్లాలోనే 35 మంది ప్రాణాలు కోల్పోయినట్టు తెలిపింది. గుంటూరు జిల్లాలో ఏడుగురు, ఏలూరు జిల్లాలో ఇద్దరు, పల్నాడు జిల్లాలో ఒకరు మరణించినట్టు వివరించింది. ఇక, రాష్ట్రవ్యాప్తంగా 6.44 లక్షల మందిపై వరద ప్రభావం పడినట్టు వెల్లడించింది. 246 పునరావాస శిబిరాల్లో 49 వేల మంది వరద బాధితులు ఆశ్రయం పొందుతున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొంది. వరదల కారణంగా 3,913 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయని, 20 జిల్లాల్లో 1.81 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగినట్టు ప్రభుత్వం పేర్కొంది. 12 జిల్లాల్లో 19 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్టు వెల్లడించింది. ఇక తెలంగాణ విషయానికి వస్తే వరద నష్టంపై ప్రాథమిక నివేదిక రూపొందించింది. రూ.5,438 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు రేవంత్ సర్కారు తన నివేదికలో వెల్లడించింది. ప్రధానంగా... రోడ్లు భవనాల శాఖ పరిధిలో రూ.2,362 కోట్లు, విద్యుత్ శాఖ పరిధిలో రూ.175 కోట్లు, పంటలు రూ.415 కోట్లు, నీటిపారుదల శాఖ పరిధిలో 629 కోట్లు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, తాగునీటి శాఖ పరిధిలో రూ.170 కోట్లు, మున్సిపల్ శాఖ పరిధిలో రూ.1,150 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు ప్రభుత్వం తన నివేదికలో పొందుపరిచింది. తక్షణ సాయంగా రూ.2 వేల కోట్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరింది. వారం రోజులుగా అతలాకుతలం చేసిన వరదల నుంచి ప్రజలు ఇప్పుడిప్పుడే సాధారణ స్థితికి చేరుకుంటుండగా, వాస్తవంగా జరిగిన నష్టం ప్రభుత్వం పేర్కొన్న దాని కంటే ఎక్కువే ఉండొచ్చని భావిస్తున్నారు. అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటించిన తర్వాతే వరద నష్టంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. ఇటీవలి వరదల్లో ఖమ్మం, మహబూబాబాద్, మరి కొన్ని జిల్లాలు తీవ్రంగా నష్టపోయాయి. ఇళ్లు కోల్పోయి, పంటలు నష్టపోయి, పశువులు, ఇతర జీవనాధారాలు కోల్పోయిన ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయం కోసం దీనంగా ఎదురుచూస్తున్నారు.

# పారా అథ్లెట్ దీప్తి జీవాంజికి భారీ నజరానా



**తెలంగాణ బ్యూరో్ప్రతినిధిః** పారిస్ పారాలింపిక్స్-20024లో సత్తాచాటిన యువ అథ్లెట్ దీప్తి జీవాంజికి తెలంగాణ ప్రభుత్వం భారీ నజరానా ప్రకటించింది. ఆమెకు రూ.కోటి నగదు, గ్రూప్-2 ఉద్యోగంతోపాటు వరంగల్‌లో 500గజాల ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే పారాలింపిక్స్‌లో ఆమె విజయం సాధించే దిశగా నడిపించిన కోచ్‌కు సైతం రూ.10లక్షల బహుమతి ఇవ్వనున్నట్లు సీఎం వెల్లడించారు. తెలంగాణకు పారాలింపిక్స్‌లో దీప్తి జీవాంజి తొలి పతకాన్ని అందించి రికార్డు సృష్టించారు. దీంతో ఆమెకు భారీ నజరానా ప్రకటించారు. వరంగల్ జిల్లా కల్లెడ గ్రామానికి చెందిన దీప్తి జీవాంజి పారాలింపిక్స్ 2024లో మహిళల 400 మీటర్ల టీ20 క్లాస్‌లో కాంస్య పతకం గెలిచిన సంగతి తెలిసిందే. అథ్లెటిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో భారత్‌కు తొలి పతకం అందించి దీప్తి చరిత్ర సృష్టించారు. అలాగే తెలంగాణ తరఫునా పారాలింపిక్స్‌లో పతకం గెలిచిన తొలి మహిళగా ఆమె నిలిచారు. దీంతో ఆమెను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ మేరకు దీప్తికి నగదు, ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే మరిన్ని పతకాలు సాధించే దిశగా తెలంగాణ యువతకు శిక్షణ, ప్రోత్సహకాలు అందించేలా ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీప్తి జీవాంజికి బహుమతి ప్రకటించడంతో సీఎం రేవంత్ రెడ్డిపై ప్రశంసల వర్షం కురుస్తోంది

# నేనే కుల్చేసుకుంటా

● బఫర్‌జోన్‌లో నిర్మాణాలు తొలగిస్తా ● హైడ్రా నోటీసులపై స్పందించిన నటుడు మురళీమోహన్



**తెలంగాణ బ్యూరో్ప్రతినిధిః** జయభేరీ కన్‌స్ట్రక్షన్స్‌కు హైడ్రా నోటీసులు.. గత 24 గంటలుగా ఎటు చూసినా ఇదే చర్చ.. అంతకుమించి రచ్చ!. ఎన్ కన్వెన్షన్ తర్వాత జే కన్‌స్ట్రక్షన్ వంతు వచ్చేసింది..! ముహూర్తం కూడా ఫిక్స్ అయ్యింది.. 15 రోజుల్లో నేల మట్టం అంటూ మీడియాలో, సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై చిత్ర విచిత్రాలుగా కథనాలు వచ్చాయి కానీ.. 'వాళ్లకు వాళ్లుగా కూల్చితే సరే లేకుంటే మేమే కూల్చేస్తాం' అంటూ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. ఎట్టకేలకు హైడ్రా ఇచ్చిన నోటీసులపై టాలీవుడ్ సీనియర్ నటుడు మురళీమోహన్ స్పందించారు. మీడియాలో వస్తున్న వార్తలపై స్పందించిన మురళీమోహన్ తాను ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని క్లారిటీ ఇచ్చుకున్నారు. ' నేను ఆక్రమణలకు పాల్పడలేదు. 33 ఏళ్లుగా రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్నాను. ఏనాడూ ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదు. బఫర్ జోన్‌లో ఉంటే నేనే కూల్చేస్తాను. స్థానికుల ఫిర్యాదుతో హైడ్రా అధికారులు వచ్చారు. బఫర్ జోన్‌లో మూడు అడుగుల మేరకు.. రేకుల షెడ్డు ఉన్నట్టు అధికారులు గుర్తించి నోటీసులు ఇచ్చారు. ఆ రేకుల షెడ్డును మేమే తొలగించేస్తాం.. హైడ్రా రానక్కర్లేదు. రెండ్రోజుల్లో (మంగళవారం లోపు) తాత్కాలిక షెడ్డును తొలగిస్తాం ' అని మురళీ మోహన్ స్పష్టం చేశారు. దీంతో కొన్ని గంటలుగా మురళీ మోహన్‌పై వచ్చిన చిత్ర విచిత్రాలుగా వచ్చిన కథనాలు, విమర్శకులకు చెక్ పెట్టినట్లు అయ్యింది. హైడ్రా అధికారులు నోటీసులు ఇచ్చిన తర్వాత ఆ సంస్థ చీఫ్ ఏవీ రంగనాథ్ కూడా స్పందించారు. ' హైదరాబాద్‌లోని నానక్ రామ్‌గూడ రంగలాల్ చెరువులో నటుడు మురళీ మోహన్ జయభేరి కన్‌స్ట్రక్షన్స్ నిర్మాణాలకు నోటీసులు జారీ చేశాం. ఫిర్యాదులు రావడంతో చెరువును పరిశీలించాం. ఆక్రమణ జరిగినట్లుగానే మా పరిశీలనలో తేలింది. వారంలో రోజుల్లో ఎఫ్‌టీఎల్‌లో ఉన్న నిర్మాణాలను తొలిగించేందుకు జయభేరి సంస్థ గడువు కోరారు. ఆక్రమణలు తొలగించకపోతే హైడ్రా కూల్చివేస్తుంది' అని రంగనాథ్ హెచ్చరించారు. ఇదిలా ఉంటే.. సండే అయినా సరే కూల్చుడే అంటూ హైడ్రా నాన్ స్టాప్‌గా, దూకుడు మీద కూల్చివేతలు షురూ చేసింది. ఇవాళ ఒక్కరోజే భారీగా కూల్చివేతలు జరిగాయి. మాదాపూర్, మేడ్చల్ జిల్లా మల్లంపేట్, సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పెద్ద చెరువు వద్ద.. ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చేస్తోంది. ఇక మాదాపూర్ సున్నం చెరువులో కూడా హైడ్రా కొరడా ఝులిపించింది. సున్నం చెరువు మొత్తం విస్తీర్ణం 26 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న షెడ్డులను భారీ బందోబస్తు మధ్య హైడ్రా కూల్చేసింది.

# ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం

● ముగిసిన వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ● విద్యార్థుల్లో గందరగోళం



**తెలంగాణ బ్యూరో్ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్ల భర్తీ ప్రక్రియ నానాటికీ ఆలస్యమవుతుంది. స్థానికత వివాదంపై హైకోర్టు ఇటీవల తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కౌన్సెలింగ్‌పై వైద్యారోగ్య శాఖ సమీక్ష నిర్వహించింది. ప్రభుత్వం స్థానికతపై మార్గదర్శకాలను రూపొందించిన తర్వాతే ప్రవేశాల ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందని నిర్ణయించింది. మరోవైపు ఇప్పటికే ఆల్ ఇండియా స్థాయిలో ఇప్పటికే తొలి విడత కౌన్సెలింగ్ పూర్తైన సంగతి తెలిసిందే. రెండో విడతకు త్వరలో నోటిఫికేషన్ వెలువడనుంది. అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ తొలి విడతకు రెండు రోజుల క్రితం నోటిఫికేషన్ వచ్చేసింది. సెప్టెంబర్ 8వ తేదీ వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ముగిసింది. 10వ తేదీతో తొలివిడత సీట్ల భర్తీ ప్రక్రియ కూడా ముగుస్తుంది. అయితే తెలంగాణలో మాత్రం ఎక్కడి గొంగళి అక్కడేనన్న చందంగా ప్రవేశాల ప్రక్రియ ముందుకు సాగలేదు. అసలెప్పుడు మొదలవుతుందో కూడా స్పష్టంగా చెప్పే పరిస్థితి లేదు. ఇప్పటికే కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. ఎంబీబీఎస్ సీట్ల కోసం 24,122 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇంతలో స్థానికత సమస్యపై హైకోర్టులో పిటిషన్లు దాఖలవడంతో.. కాళోజీ ఆరోగ్య యూనివర్సిటీ ప్రక్రియను నిలిపివేసింది. తాజాగా హైకోర్టు తీర్పు ఇవ్వడంతో.. ప్రభుత్వం స్థానికతను నిర్ధారించేందుకు కొత్త మార్గదర్శకాలను రూపొందించే పనిలో పడింది. ఇది పూర్తైతేగానీ ప్రవేశాలు ప్రక్రియ ప్రారంభంకాదు. దీంతో రాష్ట్రంలో సీటు రాకుంటే ఇతర రాష్ట్రాల్లో చేరాలనుకునే విద్యార్థుల్లో గుబులు నెలకొంది. గతేడాది సెప్టెంబరు 9 నాటికి రెండో విడత కౌన్సెలింగ్ కూడా ముగిసింది. ఇక అక్టోబరు 1 నుంచి దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం త్వరగా స్థానికతపై మార్గదర్శకాలను రూపొందించకుంటే ఎంబీబీఎస్, పీజీ సహా ఇతర కోర్సులపై ప్రభావం పడే అవకాశం ఉంది. యూజీసీ- నెట్ 2024 పరీక్షకు సంబంధించిన ప్రిలిమినరీ కీ విడుదలైంది. ఈ మేరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటన విడుదల చేసింది. ఆగస్టు 21, 22, 23వ తేదీల్లో ఈ పరీక్షలు జరిగాయి. ప్రాథమిక కీపై అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 9వ తేదీలోగా ఆన్‌లైన్‌లో తెలియజేసేందుకు అవకాశం ఇచ్చింది. అభ్యంతరాలు తెలిపే ఒక్కో ప్రశ్నకు రూ.200 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం ఫైనల్ కీతోపాటు త్వరలో ఫలితాలు వెలువడనున్నాయి.

# మాజీ ఎమ్మెల్యే కాటసాని పై హైడ్రా కేసు

● అమీన్‌పూర్ వాణినగర్ చెరువులో అక్రమ నిర్మాణాలు ● కాటసానికి చెందిన అక్రమ నిర్మాణాలను కూల్చేసిన హైడ్రా ● లేడీ డాన్ విజయలక్ష్మిపై కూడా కేసు నమోదు ● మల్లంపేట చెరువులో విల్లాలు నిర్మించిన విజయలక్ష్మి.



**హైదరాబాద్ః** అమీన్‌పూర్‌లో మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిపై కేసు నమోదైంది. అమీన్‌పూర్ వాణినగర్ చెరువులో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో.. ఇవాళ కాటసానికి చెందిన అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చేసింది. మరోవైపు.. మల్లంపేట చెరువులో విల్లాలు నిర్మించిన విజయలక్ష్మిపై కూడా కేసు నమోదు అయింది. హైడ్రా కూల్చివేతలపై కాటసాని స్పందించారు. హైదరాబాద్?లో హైడ్రా కూల్చిన బిల్డింగ్?కు తనకు సంబంధం లేదన్నారు. అమీన్‌పూర్‌లో తనకు ఎలాంటి స్థలం లేదని చెప్పారు. తన స్థలంలో కాంపౌండ్ వాల్ నిర్మించానని.. తనకు సంబంధం లేని ఇష్యూలో ఇరికించాలని చూస్తున్నారని కాటసాని పేర్కొన్నారు. హెచ్ఎండీఏ, ఇరిగేషన్ అధికారులు తన భూమి ఎఫ్టీఏ (%ఖీూ%) పరిధిలో లేదని చెప్పారని ఆయన చెప్పారు. అధికారులు ఎఫ్టీఏ పరిధిలో ఉందని నోటీసు కూడా ఇవ్వలేదని అన్నారు. నోటీస్ కూడా ఇవ్వకుండా పోలీసులు, అధికారులు వచ్చి దౌర్జన్యంగా తమ నిర్మాణాలు కూల్చారని కాటసాని రాంభూపాల్ రెడ్డి తెలిపారు. టీడీపీ నాయకులు కొంత మంది పనికట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. తాను హైడ్రాకు కోరుతున్నది ఒకటే.. మీ దగ్గర ఆధారాలు ఉంటే ఒకే కానీ, మీరు నోటీసులు ఇవ్వకుండా ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. తనకు సంబంధ లేని విషయాల్లో తన పేరు, తన అనుచరులు భూ కబ్జా చేస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. 42 పర్సంట్ తీసుకునే వాళ్ళ గురించి మాట్లాడరు కానీ.. తనను భూ కబ్జా కోరుగా చిత్రీకరించారని తెలిపారు. ఇప్పుడు అధికారులు కూల్చిన బిల్డింగ్స్ తనవేనని నిరూపించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి తనకు మంచి మిత్రుడు, కనీసం నోటీసు ఇవ్వకుండా ఇలా చేయడం మంచిది కాదని చెప్పారు. తనకు నోటీస్ కూడా ఇవ్వలేదు, తాను లీగల్ గా వెళ్తానని కాటసాని పేర్కొన్నారు. లోకేష్ బాబే రెడ్ బుక్ ఉందని చెబుతుంటే ఎమ్మెల్యేలు మాట్లాడడంలో ఏముందని ప్రశ్నించారు. ఫ్యాక్షన్ రాజకీయాలు చేశాం, చూశాం, ఫ్యాక్షన్ వద్దని రాజకీయం చేశామన్నారు. ఇప్పుడు రెడ్ బుక్ పేరుతో ఫ్యాక్షన్ రాజకీయాలు చేద్దామని చూస్తున్నారని చెప్పారు. పోలీసులు అధికార పార్టీ నాయకులు చెప్పిన విధంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. కాలం ఇలానే ఉండదు కదా%ా% తమ నాయకులు ఎందుకు భయపడతారని అన్నారు. రాజకీయ నాయకులు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి.. కొద్దిరోజులు పోతే ప్రజలే అందరికీ సమాధానం చెపుతారని కాటసాని రాంభూపాల్ రెడ్డి తెలిపారు.

# సురేందర్ రెడ్డిది ఆత్మహత్య కాదు

● కాంగ్రెస్ ప్రభుత్వ హత్య ● మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు



**తెలంగాణ బ్యూరో్ప్రతినిధి:** నిన్న మేడ్చల్ వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకున్న సురేందర్ రెడ్డిది ఆత్మహత్య కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వ హత్య అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతు రుణమాఫీకి సంబంధించిన అంశంపై హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ రోజు ఈ సమావేశం కొంత బాధతో దుఖంతో పెడుతున్న ప్రెస్ కాన్ఫరెన్స్. రైతు రుణమాఫీ విషయంలో ఈ ప్రభుత్వం చేస్తున్న వంచన, దుర్మార్గ పద్ధతులపై, అన్నదాతల పట్ల ఆవేదనతో మాట్లాడుతున్నాను. నిన్న రైతు సురేందర్ రెడ్డి రుణమాఫీ జరగలేదని ఆత్మహత్య చేసుకున్నారు. మేడ్చల్ వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు చెట్టుకు ఉరేసుకున్నాడు. 9 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన రైతుల పాలిట యమపాశంగా మారింది. దానికి సాక్ష్యం సురేంద్ రెడ్డి ఆత్మహత్య. ఆయన తన సూసైడ్ నోట్‌లో స్పష్టంగా రాశారు. బ్యాంక్ పాస్ బుక్ మీదనే సూసైడ్ నోట్ రాశారు. నా చావుకు కారణం క్రాప్ లోన్ మాఫీ కాకపోవడం. నా చావుకు కారణం క్రాప్ లోన్ చిచ్చు. సురేందర్ రెడ్డితో పాటు ఆయన తల్లి.. ఇద్దరు ఒకే రేషన్ కార్డులో ఉండడం వల్ల రుణమాఫీ కావడం లేదు. ఇద్దరికి క్రాప్ లోన్ ఉంది. రేషన్ కార్డు ఒకటే ఉండడంతో ఒక్కరికే రుణమాఫీ అవుతుందని అన్నారట బ్యాంక్ మేనేజర్. దాంతో తీవ్ర కలత చెంది సురేందర్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడని హరీశ్‌రావు తెలిపారు. సురేందర్ రెడ్డి తల్లి సుశీల పేరు మీద 2 ఎకరాల పాస్ బుక్ ఉంది. ఆమెకు రూ. 1,15,662 లోన్ ఉంది. సురేందర్ రెడ్డికి 4 ఎకరాలు.. ఆయన పాస్ బుక్ మీద రూ. 1,92,443 రుణం ఉంది. నాలుగు రోజుల క్రింత ఏపీజీవీబీ బ్యాంక్ వెళ్లి రుణమాఫీ ఎందుకు కాలేదని మేనేజర్‌ను అడిగారు. ఒకే రేషన్ కార్డు ఉండడంతో ఒక్కరికి రుణం మాఫీ అవుతుంది. ఇద్దరికి కలిపి 2 లక్షలు మాఫీ అవుతుంది. మిగతా రుణం చెల్లించాలని బ్యాంక్ మేనేజర్ అనిరుధ్ సురేందర్ రెడ్డికి చెప్పారట. దాంతో మానసికంగా కలత చెందిన సురేందర్ లక్షా 10 వేలు కట్టాలని కుటుంబ సభ్యులకు చెప్పి బాధపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. చివరకు మేడ్చల్ వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు చెట్టుకు ఉరేసుకుని చనిపోయారని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఈ సూసైడ్ నోట్ సాక్షిగా రేవంత్ రెడ్డిని అడుగుతున్నా.. పంద్రాగస్టు నాడు రుణమాఫీ అయిపోయిందని చెప్పావు..? అయిపోతే సురేందర్ రెడ్డి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు. మీరే చెప్పారు కదా రేషన్ కార్డుతో లింక్ లేదని. రుణమాఫీ గైడ్ లైన్స్ వచ్చిన రోజే అసెంబ్లీలో ప్రెస్ మీట్ పెడితే.. రేషన్ కార్డుతో లింక్ లేదని కొద్ది గంటలకు చెప్పారు. కానీ లింక్ ఉన్నది.. కాబట్టే బ్యాంక్ మేనేజర్లు రేషన్ కార్డు ప్రకారం రుణమాఫీ చేశారు. అందుకే సురేందర్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నారు. ప్రభుత్వం చెబుతున్న మాటలకు చేతలకు పొంతన లేదని స్పష్టమవుతుంది. రుణమాఫీ లబ్దిదారులను ఆంక్షల పేరుతో వేధిస్తున్నవ్. నీవు పన్నిన పన్నాగం రైతుల మెడకు ఉరి తాడైంది. రాజకీయంగా బ్లఫ్ చేద్దామనుకున్నావ్.. నీ బ్లఫ్‌కు మూల్యం సురేందర్ రెడ్డి మరణం. సురేందర్ రెడ్డి నోట్‌లో ప్రతి అక్షరం నీ దురాగాతన్ని, నీ రాజకీయ దివాళకోరుతనాన్ని, నీ నగ్న స్వరూపాన్ని ఇవాళ బజారులో నిలబెట్టిందని చెప్పక తప్పదు. ఈ సూసైడ్ నోట్ నీ దుష్ట పాలన మీద తెలంగాణ రైతులు రాసిన పంచనామా అని హరీశ్‌రావు పేర్కొన్నారు




# స్థానిక సంస్థల కోటా రిజర్వేషన్లు పెంచాలి

● బీసీలకు 20% నుంచి 40శాతానికి పెంచాలి ● కామారెడ్డి డిక్లరేషన్ అమలు ఎక్కడ ? ● కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాసిన బీసీ నేత, ఎంపీ ఆర్.కృష్ణయ్య

తెలంగాణ బ్యూరో్ప్రతినిధిః కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల వాగ్దానం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం పంచాయతీరాజ్ మున్సిపల్ ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం కు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యకులు ఆర్. కృష్ణయ్య కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాశారు, రాహుల్ గాంధీ బీసీల గురించి అనుకూలంగా మాట్లాడుతున్నారు. కానీ ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు పెంపు గురించి మాట్లడలేదు. అణిచివేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ వాగ్దానాలను అమలు చేయడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 50శాతం సీలింగ్ అని చెప్పి పెంచకుండా తప్పించుకోవడానికి వీలులేదు. ఇప్పటికి అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు పెట్టి 50 శాతం సీలింగ్ పై పార్లమెంటు రాజ్యాంగ సవరణ చేసింది. అగ్ర కులాలకు రిజర్వేషన్లు పెంచడానికి మూడు రోజులలో లోక్ సభ, రాజ్యసభలో రాజ్యాంగ సవరణ చేసే రాష్ట్రపతి సంతకం చేశారు. కాని 50 శాతం జనాభా గల బీద కులాలకు రాజ్యాంగ సవరణ చేయరా! మన దేశంలో ఇదేమి న్యాయమని ప్రశ్నించారు. అసెంబ్లీలో చట్టం చేసి 42 శాతం పెట్టవచ్చుని ఆర్. కృష్ణయ్య అభిప్రాయపడ్డారు. అవసరమైతే అన్ని పార్టీలు సహకరించడానికి సిద్ధంగా ఉన్నా యున్నవి. పార్లమెంట్ రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే గ్రామస్థాయి నుంచి ఉద్యమిస్తామని తెలిపారు.

**20న కలెక్టరేట్ ముట్టడిః** స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లు 20 శాతం నుంచి 40% పెంచాలని డిమాండ్ చేస్తూ బి.సి సంఘాలు ఈనెల 20న జిల్లా కలెక్టరేటర్లు ముట్టడించి కలెక్టర్లకు విజ్ఞప్తి చేయాలని పిలుపు నిచ్చారు. ఒకవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా బహిరంగ సభలలో ప్రతిరోజు కులగణన జరుపుతామని, దాని ప్రకారము విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు పెంచుతామని బడ్జెట్ కేటాయిస్తామని బిసి ఎజెండా ఎత్తుకొని బీసీల అభిమానం చూర గోంటుంటే ఇక్కడ బీసీలకు అన్యాయం చేయడం తగు న్యాయమా అని ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు.



# ఖైరతాబాద్‌లో విశిష్ఠ గణపయ్య కొలువుదీరాడు

## పలు రాష్ట్రాల నుంచి తరలి వస్తున్న భక్తగణం

## నవరాత్రులలో గణేషునికి విశేషపూజలు

**భారతదేశంలో ఎన్ని పండుగలు ఉన్నా వినాయక చవితి ప్రత్యేకతే వేరు. దేశంలో గణేశ్ చతుర్థిని ఘనంగా జరుపుకునే రాష్ట్రాల్లో మహారాష్ట్ర ముందుంటే ఆ తర్వాత స్థానంలో తెలంగాణలోని హైదరాబాద్ ఉంటుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ముఖ్యంగా నగరంలోని ఖైరతాబాద్ మహాగణపతి వరల్డ్ ఫేమస్.**

**గతేడాది ఇక్కడి గణపయ్య తన ఎత్తుతో ప్రపంచ రికార్డు కూడా సృష్టించాడు. అందుకే వినాయక చవితి అనగానే తెలంగాణ ప్రజలకు మరీ ముఖ్యంగా హైదరాబాద్ వాసులకు గుర్తొచ్చేది ఖైరతాబాద్ గణపయ్య. ఇక్కడ రాష్ట్రంలో అత్యంత ఎత్తయిన, ఎంతో విశిష్టమైన గణపయ్య ప్రతి ఏటా కొలువుదీరతాడు. ఈ సారి ఖైరతాబాద్ వినాయకుడు ఎన్నో ప్రత్యేకతలు కలిగి ఉండటం గమనార్హం. మరిన్ని వివరాలలోకి వెళితే....**



ఈ ఏడాది సెప్టెంబర్ 7వ తేదీనుంచి వినాయక చవితి పండుగ . గణేశ్ నవరాత్రుల పేరిట రాష్ట్ర వ్యాప్తంగా ఈ పండుగను అత్యంత ఘనంగా జరుపుకుంటారు. దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచవ్యాప్తంగా గణపతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మహానగరాలతోపాటు మారుమూల పల్లెల్లో బొజ్జ గణపయ్య నామ స్మరణ మారుమోగుతోంది. ఇప్పటికే గణేశుడి మండపాలు కొలువుదీరగా ఉదయం 6 గంటలనుంచే భక్తుల దర్శనాలు మొదలయ్యాయి. దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఖైరతాబాద్ సప్తముఖ మహాగణపతి పూజలందుకునేందుకు సిద్ధమయ్యాడు. 70వ ఉత్సవాల సందర్భంగా ఈ ఏడాది ఖైరతాబాద్ లో 70 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు శిల్పి చినస్వామి రాజేంద్రన్.. గణపతికి నేత్రాలను తీర్చిదిద్ది విగ్రహానికి ప్రాణం పోశారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులు, ఉత్సవ కమిటీ గుమ్మడికాయలు, కొబ్బరికాయలు కొట్టి బలి తీసి పూజలు ప్రారంభించారు. ముఖ్యంగా హైదరాబాద్లో ఖైరతాబాద్ గణేశుడికి భక్తులంతా ప్రత్యేక పూజలు చేస్తుంటారు. ఇక్కడి లంబోదరుడిని దర్శించుకునేందుకు దేశ నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. ఖైరతాబాద్ ఉత్సవాలను ప్రారంభించి 70 ఏళ్లు పూర్తవుతుండటంతో ఈసారి 70 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. సప్తముఖ మహాగణపతి పూజలందుకునేందుకు సిద్ధమయ్యాడు. ముహూర్తం ప్రకారం గురువారం మధ్యాహ్నం 12 గంటలకు శిల్పి చినస్వామి రాజేంద్రన్.. గణపతికి నేత్రాలను తీర్చిదిద్ది విగ్రహానికి ప్రాణం పోశారు. భక్తులు జయజయ ధ్వానాలు నడుమ ఉత్సవ కమిటీ ప్రతినిధులు గుమ్మడికాయలు, కొబ్బరికాయలు కొట్టి బలి తీశారు. కాగా, మహాగణపతి పూర్తి స్థాయిలో సిద్ధమై కళ్లను తీర్చిదిద్దడంతో ఉత్సవ కమిటీ తొలిసారిగా ఆగమన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. స్థానిక యువకులు, భక్తులు పెద్ద ఎత్తున ఈ ఆగమన్లో పాల్గొని ఉత్సాహంగా నృత్యాలు చేశారు.



### ఇదీ చరిత్ర :

ఖైరతాబాద్ గణేషుడికి సుమారు ఏడు దశాబ్దాల చరిత్ర ఉంది. 1954లో సింగరి శంకరయ్య అనే స్థానిక భక్తుడు స్థానిక ఆలయంలో ఒక అడుగు ఎత్తున్న గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి సామూహిక పూజలు చేశారు . అలా.. 2014 వరకు ప్రతి ఏటా ఒక్కో అడుగు ఎత్తు పెంచుతూ విగ్రహాన్ని తయారు చేశారు. 2019లో 61 అడుగుల ఎత్తున్న గణపతిని తయారు చేయగా.. భారతదేశంలోనే అత్యంత ఎత్తైన విగ్రహంగా రికార్డులకెక్కింది. అప్పటినుంచి విగ్రహం ఎత్తు మళ్లీ క్రమంగా తగ్గించడం మొదలు పెట్టారు. దాంతోపాటు.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహానికి గుడ్ బై చెప్పి.. మట్టి గణపయ్యకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలోనే.. గతేడాది (2023) పూర్తి మట్టితో 63 అడుగుల అత్యంత ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రపంచ రికార్డ్ నెలకొల్పారు. గత సంవత్సరం కంటే 7 అడుగులు ఎక్కువ ఎత్తుతో కమిటీ నిర్వాహకులు మొత్తం 70 అడుగుల ఎత్తుతో నిర్మిస్తున్నారు. ప్రతి ఏడాది లాగే ఈ సంవత్సరం కూడా సంప్రదాయం ప్రకారం కర్రపూజ చేసి విగ్రహం ఏర్పాటు ప్రారంభించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించారు. తొలిపూజ గవర్నర్ నిర్వహించిన ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. అన్ని శాఖల సమన్వయంతో 11 రోజులపాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసారు.

### భారీ భద్రత :

బడా గణపతిని దర్శనం చేసుకునే సమయంలో ఎలాంటి తొక్కిసలాట జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జంట నగరాల నుంచి వస్తున్న భక్తులతో బడా గణేష్ ప్రాంగణమంతా కిటకటలాడుతోంది.

24 గంటల పాటు 3 షిఫ్టుల్లో పోలీసులు విధులు నిర్వహించనుండగా.. ముగ్గురు డీఎస్పీలు, 13 మంది ఇన్స్పెక్టర్లు, 33 మంది ఎస్ఐలు, 22 ప్లాటూన్ల సిబ్బంది పనిచేయనున్నట్లు సైఫాబాద్ ఏసీ సంజయ్ కుమార్ తెలిపారు.

### ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు



ఖైరతాబాద్ వినాయకుడిని చూసేందుకు నగర ప్రజలే కాకుండా, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. వం-సగా రెండు రోజులు సెలవులు కావడంతో భక్తుల తాకిడి అధికంగా ఉండే అవకాశం ఉంది. ఇక్కడకి వచ్చే భక్తుల కోసం ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేసింది. నీటి సదుపాయం, అంబులెన్సులను ఏర్పాటు చేసింది.

### ట్రాఫిక్ మళ్లింపు

దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలను విధించారు. గణపతి దర్శనం కోసం వచ్చే భక్తులు సొంత వాహనాలను తీసుకురాకపోవడం ఉత్తమం. రైల్వేగేటు నుంచి నడచుకుంటూ వచ్చిన వారినే లోపలికి అనుమతిస్తారు. ఈ మార్గంలో వాహనాలను అనుమతించరు. ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా వచ్చిన వారు తమ వాహనాలను ఐమాక్స్ పక్కనున్న పార్కింగ్ స్థలంలో పార్కు చేయాల్సి ఉంటుంది. అలాగే, మింట్ కాంపౌండ్ వైపు వచ్చే భక్తులు వాహనాలను కారు రేసింగ్ ప్రాంతంలో పార్కు చేసి, నడచుకుంటూ దర్శనానికి రావాలి. రోడ్లపై వాహనాలను నిలిపితే సీజ్ చేస్తామని, గణపతికి మూడు వైపులా 500 మీటర్ల వరకు నో వెండింగ్ జోన్ ఉందని, చిరు వ్యాపారాలకు అనుమతి లేదని సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఆనంద్ తెలిపారు.

### రికార్డులు

సప్తముఖ గణేశుడి రూపంలో దర్శనమిస్తున్నాడు పూర్తిగా మట్టితో మహాగణపతి విగ్రహాన్ని నిర్మించారు. దాదాపు కోటి రూపాయల ఖర్చుతో నిర్మాణ పనులు చేసినట్టు చేసినట్టు సమాచారం. ఖైరతాబాద్ గణేశుడికి ఇరువైపులా.. శివపార్వతులు, శ్రీనివాసుల కల్యాణ మండపం.. ప్రత్యేక ఆకర్షణగా అయోధ్య బాలరాముడి విగ్రహం ఉంటాయి.

– సత్యగోపాల్, హైదరాబాద్





### సీఎం రేవంత్ తొలి పూజ

రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని విగ్రహాలు ఉన్నా, ఈ బడా గణేషుడి ప్రత్యేకత అంతా ఇంతా కాదు. ఖైరతాబాద్ గణేషుడికి పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో చేనేత నూలు కండువా, గాయత్రి సమర్పణ కార్యక్రమం చేశారు. ఉదయం ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి తొలి పూజ అనంతరం, సాధారణ భక్తులను దర్శనానికి అనుమతించారు. గణపతి ఉత్సవ సమితి అభ్యర్థన మేరకు హైదరాబాద్ నగరంలో లక్షా 40 వేల గణేశ్ మండపాలకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి తెలిపారు.

### గవర్నర్ జిష్ణుదేవ్ ప్రత్యేక పూజలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలి పూజల అనంతరం, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సైతం మహా గణపతిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్, వచ్చే ఏడాది మరింత వైభవంగా వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రసంగం ఆఖరున శ్లోకాలు చదివి గవర్నర్ ఆకట్టుకున్నారు.



# యూఎస్ ఓపెన్ ఛాంపియన్‌గా అరీనా

- తొలిసారి టైటిల్‌ను నెగ్గిన అరీనా సబలెంక
- ఫైనల్లో అమెరికా క్రీడాకారిణిని ఓడించిన బెలారస్ భామ

వాషింగ్టన్: యూఎస్ ఓపెన్ 2024 మహిళల ఛాంపియన్గా అరీనా సబలెంక నిలిచింది. ఫైనల్లో అమెరికాకు చెందిన పెగులాపై 7-5, 7-5 తేడాతో ఆమె విజయం సాధించింది. దీంతో తన కెరీర్లో తొలిసారి యూఎస్ ఓపెన్ టైటిల్ను సొంతం చేసుకుంది. ప్రపంచ నంబర్ 2 ర్యాంకర్ అయిన సబలెంక గత యూఎస్ ఓపెన్ ఫైనల్కు చేరినప్పటికీ టైటిల్ను సాధించలేదు. కోకో గాఫ్ చేతిలో ఓటమిపాలైంది. ఇప్పుడు ఈ యూఎస్ ఓపెన్ను గెలిచిన 26 ఏళ్ల బెలారస్ క్రీడాకారిణి సబలెంక తన గ్రాండ్స్లామ్ల సంఖ్యను మూడుకు చేర్చింది.

**నా కుటుంబం పేరు లిఖించాలని భావించా: సబలెంక**

గత 28 మ్యాచుల్లో సబలెంక కేవలం ఒక్క పోరులోనే ఓటమిపాలైంది. అదీనూ గత యూఎస్ ఓపెన్ ఫైనల్లోనే కావడం గమనార్హం. కోకో గాఫ్ చేతిలో సబలెంక ఓడింది. ఇప్పుడు యూఎస్ ఓపెన్ టైటిల్ను నెగ్గిన సబలెంక తన ఆనందాన్ని వెల్లడించింది. ఐదేళ్ల కిందట తన తండ్రిని, ఈ ఏడాది మార్చిలో తన బాయ్ఫ్రెండ్ను కోల్పోయిన సబలెంక జీవితం తీవ్ర ఒడిదొడుకులను చవిచూసింది. ఎప్పటికైనా తన కుటుంబం పేరును టెన్నిస్ చరిత్రలో లిఖించాలని భావించినట్లు సబలెంక వెల్లడించింది. "నా తండ్రిని కోల్పోయిన తర్వాత ఒకే ఒక్క లక్ష్యంతో టెన్నిస్ ఆడుతున్నా. టెన్నిస్ చరిత్రలో తన కుటుంబం నిలిచిపోయేలా చేయాలనుకున్నా. ఇప్పుడు ఈ ట్రోఫీపై నా పేరు కనిపించినప్పుడల్లా నా కుటుంబం గర్వపడుతుంది" అని పేర్కొంది.



# పారాలింపిక్స్‌లో భారత్ రికార్డు

- అత్యధిక స్థాయిలో 29 పతకాలు
- 5 స్వర్ణాలు సహా 19 పతకాలు
- బరిలోకి 84 మంది అథ్లెట్లు










పారిస్: పారిస్ వేదికగా ఆగస్టు 28న మొదలైన పారాలింపిక్స్ మరికొద్ది గంటల్లో ముగియనున్నాయి. 2020 టోక్యో పారాలింపిక్స్లో 5 స్వర్ణాలు సహా 19 పతకాలు సాధించిన భారత్.. ఈ సారి 25 పతకాలపై గురిపెట్టింది. మొత్తం 84 మంది అథ్లెట్లు బరిలో నిలిచారు. మన అథ్లెట్లు అంచనాలను మించి అద్భుతమైన ప్రదర్శన చేయడంతో భారత్ రికార్డు స్థాయిలో 29 పతకాలు సాధించింది. ఇందులో అత్యధిక మెడల్స్ అథ్లెటిక్స్లోనే రావడం విశేషం. ఈ విభాగంలో నాలుగు స్వర్ణాలు సహా 17 పతకాలు వచ్చాయి. ఓవరాల్గా ఏడు స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్యాలతో 18వ స్థానంలో నిలిచింది. పారాలింపిక్స్ చరిత్రలో భారత్ అత్యధిక పతకాలు సాధించడం ఇదే తొలిసారి. స్విట్జర్లాండ్, దక్షిణ కొరియా, బెల్జియం, అర్జెంటీనా వంటి దేశాలను వెనక్కినెట్టి టాప్-20లో నిలిచింది.

**పతకాలు సాధించిన అథ్లెట్లు :**

1) అవని లేఖరా - స్వర్ణం (షూటింగ్) మహిళల 10మీ ఎయిర్ రైఫిల్ 1) 2) మోనా అగర్వాల్ - కాంస్యం (షూటింగ్) మహిళల 10మీ ఎయిర్ రైఫిల్ 1) 3) ప్రీతి పాల్ - కాంస్యం (అథ్లెటిక్స్) మహిళల 100మీ 35 4) మనీశ్ నర్వాల్ - రజతం (షూటింగ్) పురుషుల ఎయిర్ పిస్టల్ 1. 5) రుబీనా ఫ్రాన్సిస్ - కాంస్యం (షూటింగ్) మహిళల 10మీ ఎయిర్పిస్టల్ 1. 6) ప్రీతి పాల్ - కాంస్యం (అథ్లెటిక్స్) మహిళల 200మీ 35. 7) నిషాద్ కుమార్ - రజతం (అథ్లెటిక్స్) పురుషుల హైజంప్ 47. 8) యోగేశ్ కతునియా - రజతం (అథ్లెటిక్స్) పురుషుల డిస్కస్ త్రో 56 9) నితేష్ కుమార్ - స్వర్ణం (బ్యాడ్మింటన్) పురుషుల సింగిల్స్ 3. 10) తులసిమతి మురుగేశన్ - రజతం (బ్యాడ్మింటన్) మహిళల సింగిల్స్ 5. 11) మనీశా రామదాస్ - కాంస్యం (బ్యాడ్మింటన్) మహిళల సింగిల్స్ 5. 12) సుహాస్ యతిరాజ్ - రజతం (బ్యాడ్మింటన్) పురుషుల సింగిల్స్ 4.13) రాకేశ్ కుమార్/శీతల్ దేవి - కాంస్యం (ఆర్చరీ) ఆర మిక్స్ టీమ్ కాంపౌండ్ ఓపెన్ .14) సుమిత్ అంటిల్ - స్వర్ణం (అథ్లెటిక్స్) జావెలిన్ త్రో ఎఫ్64 15) నిత్య శ్రీ శివన్ - కాంస్యం (బ్యాడ్మింటన్) మహిళల సింగిల్స్ 6.16) దీప్తి జీవాంజీ - కాంస్యం (అథ్లెటిక్స్) మహిళల 400 మీటర్ల టీ20. 17) శరద్ కుమార్ - రజతం (అథ్లెటిక్స్) పురుషుల హైజంప్ టీ63 (అథ్లెటిక్స్). 18) మరియప్పన్ తంగవేలు - కాంస్యం (అథ్లెటిక్స్) పురుషుల హైజంప్ టీ63. 19) అర్జీత్ సింగ్ - రజతం (అథ్లెటిక్స్) పురుషుల జావెలిన్ త్రో 46. 20) గుర్జర్ సుందర్ సింగ్ - కాంస్యం (అథ్లెటిక్స్) పురుషుల జావెలిన్ త్రో 46. 21) సచిన్ ఖిలారీ - రజతం (అథ్లెటిక్స్) పురుషుల షాట్పుట్ ఎఫ్46. 22) హర్విందర్ సింగ్ - స్వర్ణం (ఆర్చరీ) పురుషుల వ్యక్తిగత రికర్వ్ ఓపెన్. 23) ధరంబీర్ సింగ్ - స్వర్ణం (అథ్లెటిక్స్) పురుషుల క్లబ్ త్రో 51.24) ప్రణవ్ - రజతం (అథ్లెటిక్స్) పురుషుల క్లబ్ త్రో 51. 25) కపిల్ పర్మార్ - కాంస్యం (జూడో) పురుషుల -60 కేజీల జే1. 26) ప్రవీణ్ కుమార్ - స్వర్ణం (అథ్లెటిక్స్) పురుషుల హైజంప్ 64. 27) హొకాటో హొటోజి సెమా - కాంస్యం (అథ్లెటిక్స్) పురుషుల షాట్పుట్ ఎఫ్57. 28) సిమ్రాన్ - కాంస్యం (అథ్లెటిక్స్) మహిళల 200 మీటర్ల టీ12. 29) నవదీప్ సింగ్ - స్వర్ణం (అథ్లెటిక్స్) పురుషుల జావెలిన్ త్రో 41.

# ధోనీ రికార్డును సమం చేసిన ధ్రువ్ జురెల్

- ఒకే ఇన్నింగ్స్‌లో ఏకంగా ఏడు క్యాచ్‌లతో రికార్డు



బెంగళూరు: టీమ్ యువ కీపర్ ధ్రువ్ జురెల్ అరుదైన రికార్డును సొంతం చేసుకొన్నాడు. భారత క్రికెట్ లెజెండ్ మహేంద్ర సింగ్ ధోనీ సాధించిన అరుదైన ఫీట్ను దులీప్ ట్రోఫీలో సమం చేశాడు. బెంగళూరు చిన్నస్వామి మైదానంలో ఇండియా-ఎ తరపున బరిలోకి దిగిన అతడు అద్భుతంగా కీపింగ్ చేశాడు. ఈ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్లో ఏకంగా ప్రత్యర్థి జట్టుకు ఏడుగురు బ్యాటర్ల క్యాచ్లను పట్టుకొన్నాడు. దీంతో దులీప్ ట్రోఫీలో గతంలో ధోనీ పేరిట ఉన్న ఏడు క్యాచ్ల రికార్డును అతడు సమం చేసింది. 23 ఏళ్ల ఈ కుర్ర వికెట్ కీపర్ తొలి ఇన్నింగ్స్లో కేవలం ఒక్క క్యాచ్ మాత్రమే పట్టుకొన్నాడు. కానీ, రెండో ఇన్నింగ్స్లో మాత్రం యశస్వీ, సర్ఫరాజ్, ముషీర్ ఖాన్, నితీశ్ రెడ్డి, నవ్దీప్ సైని వంటి వారిని ఔట్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. గత కొన్ని నెలలుగా జురెల్ చక్కటి ఫామ్లో ఉన్నాడు. దీంతో ఇంగ్లాండ్పై టీమ్ ఇండియా టెస్ట్ జట్టులోకి పిలుపును అందుకొన్నాడు. ఈ సిరీస్లో అతడు నాలుగో ఇన్నింగ్స్లో 190 పరుగులు సాధించాడు. తొలి మ్యాచ్లోనే 90 పరుగులు చేయడం గమనార్హం. రిషభ్, రాహుల్ జట్టుకు దూరమైన సమయంలో వచ్చిన అవకాశాన్ని అతడు సద్వినియోగం చేసుకొన్నాడు.

**బంగ్లా సిరీస్కు రిషభ్ వర్సెస్ జురెల్..!**

దులీప్ ట్రోఫీ దెబ్బకు టీమ్ ఇండియాలో వికెట్ కీపర్ స్థానానికి బలమైన పోటీ ఏర్పడింది. రానున్న బంగ్లాదేశ్ సిరీస్కు రిషభ్, జురెల్ తీవ్రంగా పోటీపడుతున్నారు. భారత జట్టు తొలి ఆప్షన్గా ఉన్న పంత్ ఈ టోర్నీలో 34 బంతుల్లో అర్ధశతకం బాదాడు. మరో వైపు జురెల్ ఏకంగా ఏడు క్యాచ్లు పట్టడంతో పంత్కు బలమైన పోటీ ఇస్తాడని భావిస్తున్నారు.

# ఈమె అడుగుపెడితే బంగారమే

- పారాలింపిక్స్‌లోనే 18 స్వర్ణాలు సాధించిన బ్రిటన్ భామ
- విశ్వక్రీడల్లో రికార్డుల మోత మోగిస్తున్న సారా స్టోరే




పారిస్: ప్రపంచ వేదికలపై తమ ప్రతిభ చాటే లక్ష్యంతో క్రీడాకారులు అహర్నిశలు శ్రమిస్తారు. తీవ్ర పోటీని ఎదుర్కొని పతకం సాధించి తమతోపాటు దేశానికీ కీర్తి తెచ్చి పెట్టేందుకు కృషి చేస్తారు. ఇలా ఒక్కటి కాదు.. రెండున్నర దశాబ్దాల్లో విశ్వక్రీడల్లో మొత్తంగా 18 స్వర్ణాలతోపాటు అనేక రజత, కాంస్య పతకాలు సాధించి రికార్డుల మోత మోగిస్తోంది బ్రిటన్కు చెందిన పారాలింపియన్ సారా స్టోరే. సారా స్టోరేకు పుట్టుకతోనే ఎడమ చేతికి వైకల్యం ఉంది. అయినప్పటికీ స్విమ్మింగ్ పట్ల మక్కువ చూపిన ఆమె.. 14 ఏళ్ల ప్రాయంలోనే పారాలింపిక్ పోటీల్లో పాల్గొని తొలిసారి పతకం సాధించింది. 1992 నుంచి 2004 వరకు జరిగిన నాలుగు పోటీల్లో పాల్గొని మొత్తం ఐదు బంగారు, ఎనిమిది రజతాలు, మూడు కాంస్య పతకాలు సొంతం చేసుకుంది.

**సైక్లింగ్ను ఎంచుకొని:** ఏథెన్స్ పోటీల తర్వాత సైక్లింగ్ ఎంచుకున్న ఆమె.. అందులోనూ పతకాల వేట కొనసాగించింది. బీజింగ్, లండన్ పోటీల్లో అనేక పతకాలు సాధించింది. టోక్యోలో మూడు విభాగాల్లో పాల్గొన్న సారా.. మూడు స్వర్ణాలు సాధించి చరిత్ర సృష్టించింది. తాజాగా పారిస్ పారాలింపిక్స్లో (%ఖుతీఅం ఖుతీఖుశ్రీఎఎజూఅఎం%) మహిళల సైక్లింగ్ ఈవెంట్లో (%జ%5) రికార్డు సృష్టించింది. 20 నిమిషాల 22.15సెకన్లలోనే లక్ష్యాన్ని పూర్తిచేసుకుంది. ప్రత్యర్థి కంటే నాలుగున్నర సెకన్ల తేడాతో గమ్యాన్ని చేరుకొని మరో బంగారు పతకం కైవసం చేసుకుంది. స్విమ్మింగ్, సైక్లింగ్ విభాగాల్లో మొత్తంగా 29 పతకాలు సాధించిన సారా.. ఆమె క్రీడా జీవితంలో మరో మైలురాయిని చేరుకొంది. పారాలింపిక్స్లోనే 18 స్వర్ణాలు సాధించింది. వరల్డ్ ఛాంపియన్స్లో పాల్గొన్న ప్రతిసారీ పతకాలు చేతపట్టుకొని రావడం అలవాటుగా చేసుకొన్న ఆమె.. 46ఏళ్ల వయసులోనూ అలుపెరగని పోరాట పటిమతో ప్రపంచ క్రీడాకారులను ఉత్సాహపరుస్తూనే ఉంది.

# పాక్ జట్టు బాగుపడాలంటే గంభీర్ లాంటి కోచ్ ఉండాలి

## పాక్ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా

ఇస్లామాబాద్: వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న పాకిస్థాన్ క్రికెట్ తిరిగి గాడినపెట్టడానికి ఆ దేశ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా కీలక సూచన చేశాడు. ఇటు ఆటపరంగా, అటు బోర్డులోని సమస్యలను పరిష్కరించడానికి గౌతమ్ గంభీర్ వంటి కఠినమైన కోచ్ పాకిస్థాన్కు అవసరమని కనేరియా అభిప్రాయపడ్డాడు. కొన్ని నెలలుగా అన్ని ఫార్మాట్లలో పాకిస్థాన్ జట్టు ఆటతీరు ఘోరంగా ఉంది. వన్డే ప్రపంచకప్లో దారుణ ప్రదర్శన తర్వాత పరిమిత ఓవర్ల క్రికెట్కు గ్యారీ కిర్స్టెన్, టెస్టులకు జేసన్ గిలెస్పీని కోచ్లుగా నియమించినా పరిస్థితిలో మార్పులేదు. టీ20 ప్రపంచ కప్లో గ్రూప్ దశలోనే నిష్క్రమించిన పాక్.. ఇటీవల అవమానకర రీతిలో బంగ్లాదేశ్ చేతిలో టెస్టు సిరీస్ను కోల్పోయింది. ఈ నేపథ్యంలో జట్టు వైఫల్యాలపై ఆ దేశ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా స్పందించాడు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డులో ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. సమర్థంగా జట్టును నడిపే కెప్టెన్లను తయారు చేయలేకపోవడం, తరచూ కెప్టెన్లను మార్చడంతో జట్టు ప్రదర్శన పడిపోతోంది. సారథులను మార్చే ఈ విధానం పనికిరాదు. ఒక కెప్టెన్కు కట్టుబడి ఉండండి. ఒకవేళ నేను ఎవరినైనా కెప్టెన్గా చేస్తే ఆ వ్యక్తి ఒక ఏడాది సమయం ఇచ్చి మద్దతుగా నిలుస్తా. సంవత్సరం తర్వాత సమాధానం చెప్పమని అడుగుతా. ఆ ఏడాది కాలవ్యవధిలో అతడు మంచి ప్రదర్శన చేయకపోతే ఆ బాధ్యతల నుంచి వైదొలగమని చెబుతా. కొన్ని సార్లు ఇలా కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే పరిస్థితుల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఇతర జట్లు ఎందుకు బాగా రాణిస్తున్నాయి? భారత జట్టు ఎలా రాణిస్తోంది?ఆ జట్టుకు మొన్నటివరకు రాహుల్ ద్రవిడ్, ఇప్పుడు గౌతమ్ గంభీర్ కోచ్గా ఉన్నారు. గంభీర్ అద్భుతమైన క్రికెటర్, మంచి వ్యక్తి. ముక్కుసూటిగా వ్యవహరిస్తాడు. మీరు (పీసీబీ) కూడా ఇలానే బలంగా ఉండాలి. ఒత్తిళ్లకు తలొగ్గకుండా ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవాలి" అని డానిష్ కనేరియా సూచించాడు.



## అంతర్జాతీయ క్రికెట్‌కు మొయిన్ అలీ గుడ్‌బై



లండన్: ఇంగ్లండ్ స్టార్ ఆల్రౌండర్ మొయిన్ అలీ అంతర్జాతీయ క్రికెట్కు వీడ్కోలు పలికాడు. 37 ఏళ్ల మొయిన్ అలీ ఇంగ్లండ్ తరఫున 2014లో అరంగేట్రం చేశాడు. ఇప్పటి వరకు 68 టెస్టులు, 138 వన్డేలు, 92 టీ20లు ఆడాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి మొత్తం 6,600కిపైగా పరుగులు చేశాడు. బౌలింగ్లో 360ం వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడుతున్న మొయిన్ అలీ 67 మ్యాచుల్లో 1,162 పరుగులు, 35 వికెట్లు తీశాడు. 2023 జులై 27న ఆస్ట్రేలియాతో చివరి టెస్టు, 2023 నవంబర్ 11న పాక్పై చివరి వన్డే ఆడిన అలీ.. భారత్తో ఈ ఏడాది జూన్ 27న చివరి అంతర్జాతీయ టీ20 ఆడాడు.

**కొత్త తరం కోసం ఈ నిర్ణయం..**

ఇంగ్లండ్ తరఫున అంతర్జాతీయ క్రికెట్కు వీడ్కోలు చెప్పడంపై మొయిన్ అలీ స్పందించాడు. 'నాకిప్పుడు 37 ఏళ్లు. ఆస్ట్రేలియాతో పరిమిత ఓవర్ల క్రికెట్ సిరీస్కు ఎంపిక కాలేదు. మున్ముందు పరిస్థితి ఎలా ఉంటుందో తెలియదు. ఇప్పటికే ఇంగ్లండ్ తరఫున చాలా క్రికెట్ ఆడేశా.

# పతనం వైపుగా పాకిస్థాన్ క్రికెట్

- పాకిస్థాన్ స్వదేశంలో గెలిచి 1,000 రోజులుపైనే
- జట్టు స్వయంకృతాపరాధాలే కారణం అంటూ విమర్శలు




ఇస్లామాబాద్: 'హోం టైగర్స్'.. క్రీడల్లో విదేశాల్లో విజయాలు కరవైనా, సొంతగడ్డపై బాగా రాణించే జట్టుని అర్థం. ఓ రకంగా ఇంట్లో పులి. ప్రస్తుతం పాకిస్థాన్ క్రికెట్ జట్టు ఈ బిరుదుకు కూడా సరిపోని దుస్థితికి చేరుకొంది. ఎందుకంటే.. ఆ జట్టు దాదాపు మూడేళ్లుగా సొంత మైదానాల్లో ఒక్క సిరీస్ కూడా సాధించలేదు. బాబర్, రిజ్వాన్, షహీన్షా, నసీం షా ఇలా చెప్పుకొంటూ పోతే పేపర్పై పాక్ జట్టు అత్యంత భీకరంగా కనిపిస్తుంది. మైదానంలోకి దిగేసరికి ఏం అవుతోందో ఏమో.. ఒక్కసారిగా కుప్పకూలి ఓటమిని మూటగట్టుకొంటోంది. తాజాగా బంగ్లాతో సిరీస్ చేజార్చుకున్న తరవాత పాక్ ఇంటాబయటా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది.

**ఇంత దయనీయ స్థితా..?**

2021 ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికాపై విజయం తర్వాత సొంత మైదానాల్లో 1000 రోజులు దాటినా ఒక్క టెస్ట్మ్యాచ్ కూడా పాక్ గెలవలేదు. 10 మ్యాచ్లు ఆడగా.. ఆరింట ఓటమి పాలైంది. నాలుగు డ్రాగా ముగిశాయి. దాంతో ఈ శతాబ్దంలో సొంత గడ్డపై అత్యంత చెత్త రికార్డు మూటగట్టుకొన్న పేలవ జట్టుగా నిలిచింది. 1990ల్లో న్యూజిలాండ్ స్వదేశంలో 10 టెస్టులకు పైగా గెలుపు ముఖం చూడకుండా ఉంది. 2019-21 ప్రపంచ టెస్ట్ సిరీస్ సైకిల్లో పాక్ ఐదో స్థానంలో నిలిచింది. 2021-23 సీజన్లో 4 మాత్రమే గెలిచి, 7వ స్థానానికి పరిమితమైంది. ప్రస్తుతం ఆ జట్టు ఆట తీరు మరీ తీసికట్టుగా ఉంది. ఈ రెండున్నరేళ్లలో పాక్ బౌలర్ల సమష్టి యావరేజి 37.90. స్ట్రయిక్ రేట్ 65.9. తాజాగా బంగ్లా చేతిలో ఓటమి తర్వాత ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్లో 8వ స్థానానికి చేరింది. 1965 తర్వాత ఇంత ఘోరమైన ర్యాంకింగ్ పొందడం ఇదే తొలిసారి. పాక్ తర్వాత స్థానాల్లో అఫ్గానిస్థాన్, జింబాబ్వే, ఐర్లాండ్ వంటివి ఉన్నాయంటేనే ఆ జట్టు ఎంత దారుణంగా ఆడుతోందో అర్థం చేసుకోవచ్చు. జట్టు ఎంపికలోనే వైఫల్యాలు పాకిస్థాన్ జట్టు ఎంపికలో సమతౌల్యం దెబ్బతినడంతో టెస్ట్ క్రికెట్లో ఓటములు చవిచూస్తోందనే విమర్శ ఉంది. తరచూ కొత్త ఆటగాళ్లను తీసుకురావడం వల్ల జట్టు కూర్పు దెబ్బతింటోంది. కొత్త, పాత ఆటగాళ్ల మధ్య అనవసర పోటీ తలెత్తుతోంది. తరచూ ప్లేయర్లు మారుతుండటంతో ఒక నిలకడైన వ్యూహం అమలుచేయడం సాధ్యం కాని పరిస్థితి. ఆటగాళ్లు ఇలా వస్తూ పోతూ ఉండటంతో బ్యాటింగ్లో, బౌలింగ్లో వాళ్లు కుదురుకోవడం కష్టంగా మారుతోంది. స్థిరత్వం టెస్ట్ క్రికెట్కు మూలమన్న విషయాన్ని పీసీబీ మర్చిపోయినట్లుంది.

**కెప్టెన్ నిర్ణయాలు ప్రశ్నార్థకం**

పాక్ క్రికెట్లో ఇటీవల కాలంలో కెప్టెన్ల నిర్ణయాలూ ఘోరంగా ఉంటున్నాయి. తాజా సిరీస్లో ఒక్క స్పెషలిస్ట్ స్పిన్నర్ కూడా లేకుండా బరిలోకి దిగడం షాన్ మసూద్ చేసిన తప్పే అని నిపుణులు చెబుతున్నారు. ఇక బంగ్లా సిరీస్ తొలి మ్యాచ్లో కెప్టెన్ హడావుడిగా డిక్లేర్ చేయడం.. ప్రత్యర్థి జట్టును కట్టడి చేయడానికి సరైన ప్లానింగ్ లేకపోవడం వివాదాస్పదంగా మారింది. ఆటగాళ్లను వినియోగించుకోవడం, ఫీల్డింగ్ ప్లేస్మెంట్లు.. ఇలా చాలా విభాగాల్లో కెప్టెన్ల వైఫల్యం కనిపిస్తోంది.

**అంతర్గత రాజకీయాలు..**

పాక్ క్రికెట్ అంటేనే అంతర్గత రాజకీయాలకు నెలవు. జట్టు స్థిరత్వాన్ని దెబ్బతీయడంలో ఆ దేశ క్రికెట్ బోర్డు పాత్ర కూడా ఉంది. కోచింగ్ సిబ్బందినీ, సెలక్షన్ కమిటీనీ తరచూ మార్చేయడం ఆ జట్టుకు శాపంగా మారింది. కొత్తవారు వచ్చినప్పుడల్లా మార్పులు చోటుచేసుకొంటాయి. తాజాగా పరిమిత ఓవర్ల మ్యాచ్లకు గ్యారీ కిరెస్టన్ను కోచ్గా నియమించారు. 2021 నుంచి 2024 వరకు వివిధ ఫార్మాట్లకు సక్లెయిన్ ముస్తాక్, అబ్దుల్ రహ్మాన్, గ్రాంట్ బ్రాడ్బర్న్, మహమ్మద్ హఫీజ్, అజర్ మహమ్మద్, జాసన్ గిలెస్పీ, గ్యారీ కిరెస్టన్ వంటి వారు కోచింగ్ బాధ్యతలు నిర్వహించారు. ఇంతమంది వ్యూహాలనూ, ఆట తీరుల్నీ, ప్రాధాన్యాలను జట్టు ఎంతవరకు ఆకళింపు చేసుకోగలదనేది పీసీబీ పట్టించుకోలేదు. ఇక ఆ దేశంలో చోటుచేసుకొనే రాజకీయ మార్పులూ క్రికెట్ను ప్రభావితం చేస్తాయి. అక్కడ ప్రభుత్వం మారగానే.. బోర్డులో కొత్త ముఖాలు దర్శనమిస్తాయి. బంధుప్రీతికీ కొదవే లేదు. మోయినా?న్ కుమారుడు అజమ్ ఖాన్ టీ20 జట్టుకు ఎంపికవడం అంతర్జాతీయంగా పలువురు సీనియర్ క్రికెటర్లనూ ఆశ్చర్యపరిచింది.

**ఆధునిక విధానాలకు ఆమడదూరం..**

ఆధునిక క్రికెట్ ప్రమాణాలకు పాక్ జట్టు ఆమడ దూరంలో ఉంది. ఫిట్నెస్, స్పెషలైజేషన్, డేటా ఆధారిత వ్యూహరచన వంటి వాటిల్లో ఆస్ట్రేలియా, భారత్కు కనుచూపు మేరలో కూడా దాయాది లేదు. ఆధునిక క్రికెట్లో స్పోర్ట్స్ సైన్స్, అనలిటిక్స్ వంటివి మైదానంలో, బయటా తీసుకునే నిర్ణయాల్లో కీలక పాత్ర పోషిస్తాయి. పీసీబీ ఛైర్మన్ తమ ఆటగాళ్లు సిక్సర్లు కొట్టడం లేదని భావించి.. ఏకంగా మిలటరీ క్యాంప్లో శిక్షణ ఇప్పించి మరీ టీ20 ప్రపంచకప్నకు పంపారు. తీరా అక్కడ జట్టు ఘోరంగా విఫలమైంది. ఆ జట్టు యాజమాన్యం తీరుకు ఇంతకుమించిన ఉదాహరణ ఉండదు. ఇక తమ వద్ద సీమర్లకు కొదవలేదని భావించిన పాక్ యాజమాన్యం ఆసీస్ నుంచి టోనీ హెమ్మింగ్ అనే క్యూరేటర్ను రెండేళ్ల కాంట్రాక్ట్పై తీసుకొచ్చింది. గిలెస్పీ శిక్షణకు ఈ క్యూరేటర్ చేసే సీమ్ వికెట్లు కూడా తోడైతే బంగ్లాదేశ్ పని పట్టొచ్చని భావించింది. వీటిని నమ్ముకొని తాజా సిరీస్లో అందరూ సీమర్లతో బరిలోకి దిగి.. షాన్ మసూద్ బృందం అవమానకరమైన ఓటమి పాలైంది.

# సూర్య సినిమా

# 2025 సంక్రాంతి రేసులో ఇద్దరేనా?

**సంక్రాంతి ఫెస్టివల్ సీజన్ లో సినిమాలు రిలీజ్ చేయడానికి స్టార్ హీరోలు అందరూ పోటీ పడుతూ ఉంటారు. ఈ ఏడాది సూపర్ స్టార్ మహేష్ బాబు "గుంటూరు కారం"తో సంక్రాంతి రేసులో ప్రేక్షకుల ముందుకొచ్చారు. అలాగే కింగ్ నాగార్జున "నా సామిరంగా" చిత్రాన్ని రిలీజ్ చేశారు. విక్టరీ వెంకటేష్ నుంచి "సైంధవ్" మూవీ థియేటర్స్ లోకి వచ్చింది.**



ఈ ముగ్గురు స్టార్స్ లో నాగార్జున మాత్రమే కమర్షియల్ సక్సెస్ అందుకున్నారు. అలాగే ఎలాంటి స్టార్ క్యాస్టింగ్ లేకుండా వచ్చిన "హనుమాన్" బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ఇదిలా ఉంటే 2025 సంక్రాంతి రేసులో కూడా స్టార్ హీరోలు పోటీ పడటానికి రెడీ అయిపోయారు. మెగాస్టార్ చిరంజీవి "విశ్వంభర" సినిమాతో 2025 జనవరి 10న ప్రేక్షకుల ముందుకి రాబోతున్నారు. ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. పాన్ ఇండియా రేంజ్ లో "విశ్వంభర" మూవీ రిలీజ్ అవుతోంది. మెగాస్టార్ కి పోటీగా విక్టరీ వెంకటేష్ కూడా సంక్రాంతి రేసులోకి వస్తున్నారు. వెంకటేష్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో ప్రస్తుతం మూవీ చేస్తున్నారు. దిల్ రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. "సంక్రాంతికి వస్తున్నాం" అనే టైటిల్ ని ఈ సినిమాకి ఇప్పటికే కన్ఫర్మ్ చేశారని తెలుస్తోంది. టైటిల్ కి తగ్గట్లుగానే సినిమాని కూడా సంక్రాంతి కానుకగానే రిలీజ్ చేయబోతున్నారు. మాస్ మహారాజ్ రవితేజ 75వ సినిమా సంక్రాంతికి రిలీజ్ కావాల్సి ఉంది. అయితే షూటింగ్ లో రవితేజ గాయపడటంతో ఓ 5 వారాల పాటు విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో ఈ మూవీ సంక్రాంతికి రిలీజ్ అయ్యే ఛాన్స్ లేదనే మాట వినిపిస్తోంది. కింగ్ నాగార్జున 2025 సంక్రాంతికి కొత్త సినిమాతో రావాలని అనుకున్నారు. అయితే ఆయన కొత్త సినిమా ఏదీ ఖరారు కాలేదు. ధనుష్, రజినీకాంత్ సినిమాలలో మాత్రమే నాగార్జున నటిస్తున్నారు. దీంతో సంక్రాంతి రేసులో నాగార్జున లేనట్లే అని చెప్పాలి. నందమూరి నటసింహం బాలకృష్ణ బాబీ దర్శకత్వంలో మూవీ చేస్తున్నారు. ఈ సినిమాని సంక్రాంతికి రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. అయితే ఈ మూవీ రిలీజ్ డేట్ పై త్వరలో క్లారిటీ వస్తుందని భావిస్తున్నారు. ఒకవేళ బాలయ్య సంక్రాంతి రేసులో పోటీ పడితే ఈ ఫైట్ కచ్చితంగా ఇంటరెస్టింగ్ గా మారే ఛాన్స్ ఉంటుంది. ముగ్గురు సీనియర్స్ స్టార్స్ చాలా కాలం బాక్సాఫీస్ దగ్గర తలపడుతున్నట్లు అవుతుంది. గతంలో ఈ ముగ్గురు స్టార్ హీరోలుగా కొనసాగే సమయంలో ఒకరితో ఒకరు పోటీపడుతూ ఉండేవారు. గత ఏడాది బాలయ్య "వీరసింహా రెడ్డి", మెగాస్టార్ "వాల్తేరు వీరయ్య"తో సంక్రాంతి రేసులో పోటీ పడ్డారు. ఈ రెండు సూపర్ హిట్ అయ్యాయి. అయితే ఈ సారి ముగ్గురు సీనియర్ స్టార్స్ మధ్య పోటీ ఉంటుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# 60 ప్లస్ హీరోల తెలివైన గేమ్ ప్లాన్

**ప్రతి హీరోకి తమకంటూ ఒక ఫ్యాన్ బేస్ ఉంటుంది. అది బాక్సాఫీస్ వసూళ్లకు ప్రధాన బలంగా మారుతుంది. ఇటీవల మల్టీస్టారర్లలో నటించడానికి సౌతిండియన్ స్టార్లు ఆసక్తి చూపడం అన్ని విధాలా కలిసొచ్చే పరిణామం. గతంతో పోలిస్తే వర్తమానంలో పాన్ ఇండియా ట్రెండ్ స్టార్ల అవకాశాల వెల్లువను అమాంతం పెంచింది. ఈ పరిణామం సీనియర్ హీరోల ఎక్స్‌పయిరీ డేట్‌ని ఎక్స్ టెంట్ చేసింది. ఒక వయసు దాటాక కొందరికి అవకాశాలు దక్కడం చాలా కష్టం. కానీ ఇప్పటి ట్రెండ్‌లో సీనియర్‌లకు వయసుతో సంబంధం లేకుండా అవకాశాలొస్తున్నాయి. అలాగే సోలోగా ఒక్క హీరోనే సినిమా మొత్తాన్ని తమ భుజస్కంధాలపై నడిపించేయాలనే అత్యాశ కూడా ఇటీవల పెద్దగా కనిపించడం లేదు.**

ఏది ఏమైనా ఈ పరిణామం 60 ప్లస్ హీరోలకు బాగా కలిసొస్తోంది. %-%కల్కి 2989 ఏడీ%-%లో ప్రభాస్ ప్రధాన హీరోనే అయినా 70 ప్లస్ అమితాబ్ బచ్చన్ సినిమా కథంతా నడిపించారు. పాన్ ఇండియా ట్రెండ్ కల్పించిన అవకాశమిది. జైలర్ లో రజనీకాంత్ సైతం మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్, జాకీ ష్రాఫ్ వంటి స్టార్లకు అవకాశం కల్పించి వారిని అదనపు ఆయుధాలుగా మలుచుకోగలిగారు. 60 ప్లస్ రజనీకి వారంతా ప్రధాన అస్సెట్.



లాల్, జాకీ కూడా 60 ప్లస్ హీరోలు. అయితే ఇతర పెద్ద హీరోలకు తమ సినిమాలో పెద్ద పాత్రల్లో అవకాశాలు కల్పించడం అంటే దానికి నిజంగా ధైర్యం అవసరం. రజనీ ఈ విషయంలో భేషజానికి పోలేదు. తదుపరి లోకేష్ కనగరాజ్ తో %-%కూలీ%-%లోను నాగార్జున (65), ఉపేంద్ర (55), సత్యరాజ్ (69) వంటి పెద్ద స్టార్లకు రజనీకాంత్ అవకాశం కల్పించారు. వీరంతా కీలక పాత్రల్లో నటిస్తున్నారా? కేవలం అతిథులుగానే కనిపిస్తారా? అన్నదానిపై క్లారిటీ లేదు. ఆ లోటు కనిపిస్తోంది ఒక వేళ విక్రమ్ సినిమాలో కమల్ (69)- సేతుపతి-ఫహద్ పాత్రల్లా నాగ్, ఉపేంద్ర, సత్యరాజ్ పాత్రలు కుదిరాయంటే రజనీ సినిమా రేంజు మరో లెవల్ కి చేరిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తీస్తున్నది లోకేష్ కనగరాజ్ కాబట్టి అభిమానులకు ఆమాత్రం గురి ఉంది. బంగారం స్మగ్లింగ్ మాఫియా కథాంశం కాబట్టి భారీగా యాక్షన్ కి అవకాశం ఉంటుంది. కూలీ వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. లోకేష్ మరోసారి తన గత బ్లాక్ బస్టర్ల రేంజులో అద్భుత కథాంశం, గ్రిప్పింగ్ నేరేషన్ తో రక్తి కట్టిస్తాడనే అంతా ఆశిస్తున్నారు. ఓవరాల్ గా రజనీకాంత్- నాగార్జున- మోహన్ లాల్ లాంటి సౌత్ అగ్ర హీరోలు ఇతర సీనియర్ హీరోలను కలుపుకుని పోవడం సరికొత్త గేమ్ ప్లాన్. ఇది వర్కవుటైతే ఇదే స్టార్లు రిపీటెడ్ గా సినిమాలు చేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. మన దర్శకరచయితలు ఇలాంటి పాపులర్ స్టార్లను కలుపుకుని వెళ్లే కథల్ని, కంటెంట్ ని రెడీ చేస్తే అది వారికి పాన్ ఇండియాలో అడ్వాంటేజ్ అవుతుందేమో!

# హిల్‌స్టేషన్‌లో ఎన్టీఆర్-ప్రశాంత్-రిషబ్ ఫ్యామిలీస్




యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం షూటింగ్‌కి విరామం ఇచ్చిన సంగత తెలిసిందే. అతడు కుటుంబంతో డివోషనల్ యాత్రలో ఉన్నారు. ఈ యాత్రలో ఏం జరిగిందో ప్రతిదీ అభిమానులకు తెలుసు. ఎన్టీఆర్ తన తల్లి, భార్య లక్ష్మీ ప్రణతితో కలిసి గతవారం మంగళూరు విమానాశ్రయంలో దిగారు. తన పర్యటన సందర్భంగా ఉడిపి శ్రీకృష్ణ దేవా లయం, కేశవనాథేశ్వరాలయం, మూకాంబిక ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అయితే వారి భక్తి యాత్ర ఆద్యంతం ఇద్దరు కన్నడ సినీ రంగ ప్రముఖులు వారితో ఉన్నారు. అందులో ఒకరు కేజీఎఫ్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాగా, మరొకరు కాంతార హీరో కం డైరెక్టర్ రిషబ్ శెట్టి.. సక్సెస్ తో జోష్ మీద ఉన్న ఆ ఇద్దరితో తారక్ స్నేహం ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ పెంచుతోంది. ఆ ముగ్గురి కలయికలో సినిమాలపైనా అభిమానుల్లో జోరుగా చర్చ సాగుతోంది. తదుపరి తారక్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో నటించనుండగా, రిషబ్ తోను ఓ సినిమాకి ప్లాన్ చేస్తున్నట్టు కథనాలొస్తున్నాయి. అదంతా ఒకెత్తు అయితే, వృత్తిగత జీవితాన్ని కొద్దిరోజులు పక్కన పెట్టి వీరంతా ఇప్పుడు హిల్ స్టేషన్ లో వెకేషన్ ని ఆస్వాధిస్తూ కనిపించారు. ప్రముఖులంతా వారి భార్యలతో కలిసి హిల్ స్టేషన్‌లో వెకేష న్‌ని ఎంజాయ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా తీసిన ఫోటోలో తారక్ తల్లి షాలిని కూడా కనిపించారు. ప్రస్తుతానికి దేవర టెన్షన్స్‌తో పెట్టుకోకుండా తారక్, తన స్నేహితులైన కన్నడ స్టార్ రిషబ్, డైరెక్టర్ ప్రశాంత్‌లతో కలిసి ప్రకృతి మధ్య ఆనందంగా గడుపుతున్నారు. ఇంతకుముందు మూకాంబిక ఆలయ సందర్శన సందర్భంగా ఎన్టీఆర్ మీడియాతో మాట్లాడుతూ, రిషబ్ శెట్టి తనకు తగిన పాత్రను ఆఫర్ చేస్తే కాంతార2లో నటించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పాడు. మరోవైపు ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా ఈ సంవత్సరం సెట్స్ కెళ్లనుంది. అధికారికంగా చిత్రీకరణ షెడ్యూళ్లను ప్రకటిస్తారని అభిమానులు ఆసక్తిగా వేచి చూస్తున్నారు. తారక్ నటించిన దేవర 1 రాకకోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా వేచి చూస్తున్న సంగతి తెలిసిందే.

# లైగర్ బ్యూటీకి పెద్ద ఊరట



లైగర్ చిత్రంతో టాలీవుడ్ కి పరిచయమైంది అనన్య పాండే. నేటి తరం స్టార్ అనన్యకు ఇప్పుడు తెలుగులోను మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. లైగర్ జయాపజయాలతో సంబంధం లేకుండా ఈ బ్యూటీని తెలుగు ప్రజలు ప్రేమించారు. ఇకపోతే అనన్య కొంతకాలంగా సరైన విజయం కోసం చాలా తపిస్తోంది. తాజాగా అమెజాన్ ప్రైమ్‌లో అనన్య పాండే నటించిన కొత్త షో %-%కాల్ మీ బే%-% స్ట్రీమ్ అవుతోంది. దీనికి గత కొన్ని రోజులుగా టీమ్ చాలా ప్రచారం చేసింది. అమెజాన్ ప్రైమ్‌లో కాల్ మి బే అందుబాటులో ఉంది. ఈ షోకి ప్రారంభ సమీక్షలు బాగున్నాయి . అనన్య తన నటనకు ప్రశంసలు అందుకుంది. నటీనటుల ప్రదర్శన.. గ్రిప్పింగ్ స్టోరి స్క్రీన్ ప్లే దీనికి ప్రధాన బలం అని సమీక్షకులు చెబుతున్నారు. కొల్లిన్ డి కున్హా దర్శకత్వం వహించిన %-%కాల్ మి బే%-% ఒక ధనిక మహిళ కథతో రూపొందింది. ధనికురాలైన యువతి తన సంపదను కోల్పోయిన తర్వాత జీవితం ఎలాంటి నాటకీయ మలుపు తిరిగింది? అన్నది తెరపై చూపించారు. ధనవంతుడైన భర్త కూడా ఆమెను విడిచిపెట్టడంతో పరిస్థితులు ఎలా తలకిందులయ్యాయి? అన్నది కూడా ప్రధానమైన ఎలిమెంట్.తన జీవితంలో ఎదురైన సంఘటనలను ఆ యువతి ఎలా మ్యానేజ్ చేసింది? అన్నది తెరపై విమర్శకులు ఆసక్తికరంగా చూపించారని టాక్ వినిపిస్తోంది. ధనికురాలిగా అనన్య నటన ఆకట్టుకుందని ప్రశంసలు కురుస్తున్నాయి.

# 'శ్వాగ్' నుంచి రెట్రో బీట్స్ 'గువ్వ గూటిలో' సాంగ్



కింగ్ ఆఫ్ కంటెంట్ శ్రీవిష్ణు, ట్యాలెంటెడ్ డైరెక్టర్ హసిత్ గోలి కాంబో 'శ్వాగ్' హిలేరియస్ టీజర్‌తో అందరినీ మెస్మరైజ్ చేశారు. టీజర్‌లో శ్రీవిష్ణు డిఫరెంట్ క్యారెక్టర్స్ లో, డిఫరెంట్ టైమ్‌లైన్‌లలో అద్భుతంగా ఆలరించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

వివేక్ సాగర్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. ఫస్ట్ సింగిల్ సింగరో సింగ చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రం నుండి సెకండ్ సింగిల్- గువ్వ గూటిలో విడుదల చేశారు. యయాతి డాన్స్ ట్రూప్ హెడ్ గా శ్రీవిష్ణు అదరగొట్టారు. ఈ పాట 80, 90ల స్టయిల్ విజువల్ ఎసెన్స్, రెట్రో బీట్‌లు, స్టైలిష్ కొరియోగ్రఫీతో వింటేజ్ నాస్టాల్జిక్ డైవ్ ప్రజెంట్ చేస్తోంది.

వివేక్ సాగర్ రెట్రో-కంపోజింగ్, భువన చంద్ర ఆకట్టుకునే లిరిక్స్ కంప్లీట్ చేశాయి. మనో, గీతా మాధురి, స్నిగ్ధా శర్మల డైనమిక్ వోకల్స్ తో ఎనర్జిటిక్ గా పాడారు, ట్రాక్ కన్నుల విందుగా ఉంది. రెట్రో-స్టైల్ డ్యాన్స్ మూవ్‌లకు శిరీష్ కుమార్ కొరియోగ్రఫీ చేశారు.

కలర్ ఫుల్ జాతర నేపథ్యంలో సెట్ చేయబడిన గువ్వ గూటిలో సాంగ్ ప్రత్యేకించి గణేష్ చతుర్థి పండక్కి ట్రీట్ కాబోతోంది. ఈ చిత్రంలో రీతూ వర్మ హీరో నటిస్తుండగా, మీరా జాస్మిన్, సునీల్, దక్షనాగార్కర్, శరణ్య ప్రదీప్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

వేదరామన్ శంకరన్ సినిమాటోగ్రాఫర్ కాగా, వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. జిఎం శేఖర్ ఆర్ట్ డైరెక్టర్ కాగ, నందు మాస్టర్ స్టంట్స్ నిర్వహిస్తున్నారు. శ్వాగ్ అక్టోబర్ 4న థియేటర్లలో విడుదల కానుంది.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044